News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :217 | ఖమ్మం | శుక్రవారం, సెప్టెంబర్ 11, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# 'సర్' తో ప్రమాదం!



- ఈ ప్రమాదం వెనుక ఉన్న అంతర్యాన్ని నేతలు గ్రహించాలి
- 'సర్' ప్రక్రియను తీవ్రంగా పరిగణించాలి..అర్హులైన వారి ఓట్లు కాపాడాలి
- దేశ వ్యాప్తంగా 15 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయి
- ఓట్ల తొలగింపు ప్రమాదం మన దరిదాపులకు రానీయొద్దు
- ఎమ్మెల్యేగా గెలవాలనుకునే ప్రతి ఒక్కరూ దీన్ని సీరియస్‌గా తీసుకోవాలి
- శాసనసభ జరగకుండా ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన కుట్ర
- అసెంబ్లీ ఘటనలపై ఫ్లాష్ సర్వేలో కాంగ్రెస్‌కు చాలా పాజిటివ్‌గా వచ్చింది
- సభ జరిగినన్ని రోజులూ కాంగ్రెస్ సభ్యులు పూర్తిగా హాజరు కావాలన్న సీఎం

హైదరాబాద్

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ద్వారా ఎక్కడో ఏదో ప్రమాదం పొంచి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ ప్రమాదం వెనుక ఉన్న అంతర్యాన్ని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు గ్రహించాలని చెప్పారు. ఎస్ఐఆర్‌ను చాలా సీరియస్‌గా తీసుకోవాలని అన్నారు. ఈ విషయం ఇప్పటికే పలుమార్లు చెప్పానని, ఎమ్మెల్యేగా గెలవాలనుకునే ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియను - మిగతా3లో



## వైఎస్ పేదల కోసం గుర్తించిన స్థలాలు నెల రోజుల్లో ఇస్తాం

- 2024లో రాష్ట్ర ప్రభుత్వం సర్వే పూర్తి చేసి, ఆవాస్ యోజన అర్హత కలిగిన 11,56,929 కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాం
- రాష్ట్ర ప్రభుత్వం 8 లక్షల ఇళ్లకు రూ.40 వేల కోట్లు ఖర్చు చేస్తోంది
- భవిష్యత్‌లో అర్హులకు మూడు, నాలుగో విడతలో కూడా ఇళ్లు ఇవ్వాలని ఆలోచిస్తోంది
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి




## ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు

- సర్వం సిద్ధమన్న ప్రధాని మోదీ
- ఈ వారాంతంలో ఢిల్లీ వేదికగా బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు
- సర్వం సిద్ధం అంటూ ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్
- హాజరుకానున్న రష్యా, చైనా అధ్యక్షులు పుతిన్, జిన్‌పింగ్
- రాజధానిలో 15,000 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత
- భారత్‌కు ఇది నాలుగోసారి అధ్యక్ష బాధ్యత

## ఫ్యూచర్ లేని సిటీ




- ఫ్యూచర్ లేని సీఎం తన సోదరులతో కలిసి రియల్ ఎస్టేట్ నాటకం ఆడుతున్నారు
- ఇందులో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దు..బలి పశువులు కావొద్దు
- టెస్సెరాక్ట్ కంపెనీకి ఏటా రూ.లక్ష కూడా టర్నోవర్ లేదు
- రూ.250 కోట్లు విలువ చేసే భూములను రూ.7 కోట్లకే కట్టబెట్టడంపై కోర్టులను ఆశ్రయిస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మహేశ్వరంలో టెస్సెరాక్ట్ కంపెనీకి కేటాయించిన భూమిని పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు

## అంతరిక్షం అందరిదీ,.. బాధ్యత కూడా సమష్టిగా ఉండాలి



- పారిస్‌లో జరుగుతున్న అంతర్జాతీయ స్పేస్ సమ్మిట్‌లో మోదీ వర్చువల్ ప్రసంగం
- అంతర్జాతీయ చట్టాల ఆధారంగా సురక్షిత, శాంతియుత, సుస్థిర అంతరిక్ష వ్యవస్థకు భారత్ మద్దతు
- 'శతాబ్దాలుగా అంతరిక్షం మానవ ఊహాశక్తికి స్ఫూర్తినిచ్చింది
- ఇప్పుడు అంతరిక్ష సాంకేతికత భూమిపై జీవన విధానాన్ని ప్రభావితం చేస్తోంది



## చైనా షిప్‌యార్డ్‌లో అగ్నిప్రమాదం

- కార్గో నౌకలో 20 మంది మృతి
- చైనాలోని కింగ్‌దావో షిప్‌యార్డ్‌లో కార్గో నౌకలో భారీ అగ్నిప్రమాదం
- ఈ దుర్ఘటనలో 20 మంది సిబ్బంది మృతి, ఐదుగురు గల్లంతు
- మరమ్మతుల కోసం ఆగిన 'ఓషన్ మెలోడీ' నౌకలో ఘటన
- సహాయక చర్యలు వేగవంతం చేయాలని అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆదేశం

## నినాదాల హోరు.. పాటల జోరు

- శాసనమండలిలో బీఆర్ఎస్ సభ్యుల నిరసన
- '22ఏ'పై వాయిదా తీర్మానం ఇచ్చిన విపక్ష ఎమ్మెల్సీలు
- ప్రశ్నోత్తరాల సమయంలో చర్చకు పట్టు...
- వాయిదా తీర్మానం తిరస్కరించినట్లు చైర్మన్ ప్రకటన
- నిరసనగా వాకౌట్ చేసిన బీఆర్ఎస్ సభ్యులు



హైదరాబాద్

బీఆర్ఎస్ సభ్యుల నినాదాలు...నిరసన పాటలతో గురువారం శాసన మండలిలో గందరగోళం నెలకొంది. నిషేధిత భూముల (22ఏ) అంశంపై చర్చకు వాయిదా తీర్మానం ఇచ్చిన విపక్ష సభ్యులు దానిపై చర్చకు పట్టుబట్టారు. చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఈ వాయిదా తీర్మానాన్ని అనుమతించకపోవడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు పోడియం వైపు దూసుకొచ్చి నినాదాలు, నిరసన పాటలతో హోరెత్తించారు. తీర్మానం తిరస్కరిస్తున్నట్టు చైర్మన్ ప్రకటించడంతో నిరసన వ్యక్తం చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. గురువారం మండలి ప్రారంభమైన వెంటనే చైర్మన్ ప్రశ్నోత్తరాలను ప్రారంభించారు. అయితే 22ఏ అంశంపై ఇచ్చిన వాయిదా తీర్మానం చర్చకు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ పక్షనేత సిరికొండ మధుసూదనాచారి నేతృత్వంలో - మిగతా3లో



## 18 ఏళ్లలోపు పిల్లల సోషల్ మీడియా వినియోగం

- కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు
- పిల్లల ఆన్‌లైన్ భద్రతపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- మైనర్లు సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను వినియోగించడంపై రక్షణ చర్యలు కోరుతూ పిటిషన్
- దీనిపై కేంద్రానికి నోటీసులు జారీ చేసిన అత్యున్నత న్యాయస్థానం

## జల విద్యుత్ ప్రాజెక్టులపై సోలార్ విద్యుత్

- నీటిపారుదల, విద్యుత్ శాఖల సమన్వయ కృషి
- సభలో డిప్యూటీ సీఎం భట్టి వెల్లడి
- సాధారణ సోలార్ ప్రాజెక్టులతో పోలిస్తే ఫ్లోటింగ్ సోలార్ ఏర్పాటుకు వ్యయం ఎక్కువ అవుతుంది
- సౌర విద్యుత్ ప్రాజెక్టులను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నాం



హైదరాబాద్

రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని సౌర విద్యుత్, జలాశయాలపై తేలియాడే సౌర విద్యుత్ ప్రాజెక్టులను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శాసనసభలో గురువారం ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, కసిరెడ్డి నారాయణరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి తదితరులు అడిగిన ప్రశ్నకు ఆయన సుదీర్ఘ వివరణ ఇచ్చారు. ప్రాజెక్టులకు సంబంధించి విద్యుత్, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా అధ్యయనం చేస్తున్నాయని - మిగతా3లో

## రిజిస్టర్డ్ పార్టీగా టీవీకే ఈసీ అధికారిక గుర్తింపు



- ప్రజలకు విజయ్ కృతజ్ఞతలు
- తమిళగ వెట్రి కళగం (టీవీకే)కు ఎన్నికల సంఘం గుర్తింపు
- తమిళనాడు, పుదుచ్చేరిలో రిజిస్టర్డ్ రాజకీయ పార్టీగా గుర్తింపు

# ఫ్యూచర్ లేని సిటీ...

రంగారెడ్డి జిల్లా: ఫ్యూచర్ సిటీ ఓ మిథ్య అని, దానికి ఎలాంటి ఫ్యూచర్ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు వ్యాఖ్యానించారు. ఫార్మాసిటీ పేరుతో సేకరించిన భూముల్లో రియల్ ఎస్టేట్ పెట్టుబడులు చెల్లవని, ఫ్యూచర్ లేని సీఎం..తన సోదరులతో కలిసి ఆడుతున్న రియల్ ఎస్టేట్ నాటకంలో బలిపశువులు కావొద్దని విజ్ఞప్తి చేశారు. 'పెట్టుబడులు పెట్టి మోసపోవొద్దు. ఏటా రూ.లక్ష కూడా టర్నోవర్ లేని సీఎం సోదరుడు కొండల్‌రెడ్డికి చెందిన టెస్సెరాక్ట్ కంపెనీకి రూ.250 కోట్లు విలువ చేసే భూములను రూ.7 కోట్లకే కట్టబెట్టడంపై కోర్టులను ఆశ్రయిస్తాం. ఎనుముల అన్నదమ్ముల దోపిడీని ఎట్టి పరిస్థితుల్లోనూ వదలిపెట్టబోం..'అని అన్నారు. గురువారం మహేశ్వరం మండలం తుక్కుగూడ ఫ్యాబ్‌సిటీ (ఈసిటీ)లో టెస్సెరాక్ట్ కంపెనీకి కేటాయించిన భూములను బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం పరిశీలించింది. ఆ కంపెనీకి భూ కేటాయింపులపై నిరసన వ్యక్తం చేసింది. అనంతరం పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాలేరు వెంకటేష్, గూడెం మహిపాల్‌రెడ్డితో కలిసి కేటీఆర్ మాట్లాడారు.




### ఇందులో న్యాయపరమైన చిక్కులు ఉన్నాయి..

'ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రభుత్వం రియల్ ఎస్టేట్ మాయాజాలం నడుపుతోంది. వాస్తవానికి ఫార్మాసిటీ కోసం నిర్దిష్ట షరతులతో భూసేకరణ జరిగింది. ఆ భూములను ఇప్పుడు ఇతర కార్యకలాపాలకు వినియోగించడం చట్టపరంగా ప్రశ్నార్థకం. ఫ్యూచర్ సిటీ భవిష్యత్తుపై న్యాయపరమైన చిక్కులు ఉన్నాయి. పెట్టుబడులు పెడుతున్న పారిశ్రామికవేత్తలు ఈ న్యాయపరమైన అంశాలను పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలి. రేపు కోర్టులో ఈ భూములపై వివాదాలు తలెత్తితే నష్టపోయేది పారిశ్రామికవేత్తలే.

### పూర్తి వివరాలు ప్రజల ముందుంచాలి

ఈ భూ కేటాయింపుపై ప్రభుత్వం పూర్తి వివరాలను ప్రజల ముందు ఉంచాలి. సీఎం కుటుంబ సభ్యులకు ప్రభుత్వ భూములు, రాయితీలు, మినహాయింపులు ఇవ్వడం అధికార దుర్వినియోగం కాదా? ప్రయోజనాల సంఘర్షణ కాదా? కుటుంబ పాలన కాదా? ఒకవైపు సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి.. మరోవైపు పారిశ్రామికవేత్త ఎనుముల జగదీశ్వర్‌రెడ్డిల మధ్య రూ.1,000 కోట్ల పెట్టుబడి ఒప్పందం. దానికి మళ్లీ ప్రభుత్వ రాయితీలు, ప్రభుత్వ భూములు, మినహాయింపులు ఇవ్వాలా? సీఎం సోదరుడి సంస్థ ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ ఎకో సిస్టమ్‌తో చేసుకున్న ఒప్పందంపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి.

### బీజేపీ, కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు స్పందించడం లేదు?

అనామక కంపెనీకి విలువైన భూములు కేటాయించిన వ్యవహారంపై బీజేపీ, కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు స్పందించడం లేదు? ఈడీ, ఐటీ, సీబీఐలు మాపై కేసులు పెట్టడానికే ఉన్నాయా? అధికారంలో ఉన్నవారి వ్యవహారాలు వారికి ఎందుకు కనిపించడం లేదు? తెలంగాణ..కాంగ్రెస్‌కు ఏటీఎంగా మారిందని ప్రధాని, కేంద్ర హోంమంత్రి ఆరోపిస్తున్నారు. తెలంగాణను కొల్లగొడుతున్నారని ఆరోపిస్తున్నప్పుడు దొంగలను పట్టుకోవాల్సిన హోం మంత్రి ఎక్కడున్నారు? ఇంత పెద్ద వ్యవహారం జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలు కేంద్ర ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలకు లోబడి ఉంటాయి. ఈ రంగంలోనూ అధికారానికి దగ్గర గా ఉన్న కుటుంబాలకు ప్రయోజనాలు కల్పిస్తున్నారన్న ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి. రేవంత్‌రెడ్డి కుటుంబానికి చెందిన సంస్థలతో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి చెందిన సంస్థలు కూడా ఏరోస్పేస్, డిఫెన్స్ రంగంలోకి రావడంపై పూర్తి వివరాలు వెల్లడించాలి.

### సామాన్యులకు కూడా ఇలాగే భూములు ఇస్తారా?

భూ కేటాయింపుల్లో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తే సామాన్యులు, యువత, రైతులకు కూడా ఇదే తరహాలో ప్రభుత్వ భూములు, రాయితీలు ఇవ్వాలి. మేము లక్ష రూపాయల మూలధనంతో పెట్టుబడి పెడతామని వస్తే కోట్ల విలువైన స్థలం ఇస్తారా? మాకు కూడా ఇదే రాయితీలు, మినహాయింపులు ఇస్తారా? ఈ వ్యవహారాన్ని ఇంతటితో వదిలిపెట్టబోం. అవసరమైతే ప్రజా కోర్టును ఆశ్రయిస్తాం, రంగారెడ్డి జిల్లాలోని ప్రతి గ్రామంలో సదస్సులు నిర్వహించి భూకేటాయింపులు, ఫ్యూచర్ సిటీ పేరుతో జరుగుతున్న వ్యవహారాలను ప్రజలకు వివరిస్తాం..'అని కేటీఆర్ అన్నారు.

# 'సర్'తో ప్రమాదం!



-మొదటిపేజీ తరువాయి

తీవ్రంగా పరిగణించాలని, అర్హులైన వారి ఓటు హక్కును కాపాడాలని సూచించారు. గురువారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎం అధ్యక్షతన కాంగ్రెస్ శాసనసభా పక్ష (సీఎల్పీ) సమావేశం జరిగింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబుతో పాటు ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ భేటీలో పాల్గొన్నారు. సమావేశం ప్రారంభం కాగానే మాజీ ఎమ్మెల్యేలు కొమ్మిది నరసింహారెడ్డి, వంగా సుబ్బారావు, జి.సిద్ధయ్యల మృతికి సీఎల్పీ సంతాపం తెలిపింది. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడారు.

'ఎస్ఐఆర్ పేరుతో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోంది. దేశంలో వయోజనుల జనాభా 103 కోట్లుగా చూపెడుతున్నారు. కానీ ఓటర్ల సంఖ్య మాత్రం 88 కోట్లే అంటున్నారు. అంటే దాదాపు 15 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయి. ఈ 15 కోట్ల ఓట్ల తొలగింపు కారణంగా పొంచి ఉన్న ప్రమాదాన్ని అంచనా వేయగలగాలి. ఆ ప్రమాదం మన దరిదాపులకు రానీయకుండా మీరే జాగ్రత్త పడాలి. మీ ప్రవర్తన రెండోసారి గెలుపుపై ప్రభావం చూపుతుంది. మీ వ్యక్తిగత పనితీరు మీ గెలుపోటములను ప్రభావితం చేస్తుంది. ఎస్ఐఆర్ కోసం నేను రెండు రోజులు కొడంగల్‌లోనే ఉన్నా. ఎమ్మెల్యేలందరూ అలానే ఫోకస్ పెట్టాలి. తెలంగాణలో జరిగిన జనగణన దేశానికి రోల్‌మోడల్. రాష్ట్ర నమూనాను దేశ వ్యాప్తంగా జనగణనలో చేపట్టేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి.

### అధికారం పోయినా అహంకారం పోలేదు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా తీసుకున్న నిర్ణయాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలను గురించి రాష్ట్ర ప్రజలకు వివరించాలి. అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తుంటే ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన సభ జరగకుండా కుట్ర చేశారు. అధికారం పోయినా వారికి అహంకారం పోలేదు. పోలీసులు, ప్రజాప్రతినిధులను దూషించి మూడు రోజుల పాటు సభ సజావుగా జరగకుండా చేశారు. అధికారులపై అనుచితంగా వ్యవహరించారు. మహిళా అధికారుల ముందు టీ షర్టులు విప్పి ఇబ్బంది కలిగించారు. సభాపతిని అత్యంత అభ్యంతరకరంగా దూషించారు. దళితులు నిరసన తెలిపేందుకు వెళ్లిన నేలను శుద్ధి చేసి అవమానపర్చారు. అయినా ప్రతిపక్షం కుట్రలను బలంగా తిప్పికొట్టడంతో పాటు ఆ కుట్రను ప్రజలకు తెలియజేయగలిగాం..'అని సీఎం అన్నారు. కుట్రను తిప్పికొట్టారంటూ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అభినందించారు.

### అసెంబ్లీలో పనితీరు ఆధారంగానే పదోన్నతులు

'అసెంబ్లీలో జరిగిన ఘటనల గురించి ఫ్లాష్ సర్వే చేయించా. అందులో కాంగ్రెస్‌కు చాలా పాజిటివ్‌గా వచ్చింది. మనం ఏం చేస్తున్నామో ప్రజలు గమనిస్తుంటారు. కాంగ్రెస్ సభ్యులు లాబీల్లో తిరగడం కాదు. అసెంబ్లీలో హాజరు తగ్గకుండా చూసుకోవాలి. సభ జరిగినన్ని రోజులు ఖచ్చితంగా హాజరు కావాలి. చర్చల్లో పాల్గొనాలి. నియోజకవర్గాల సమస్యలు ప్రస్తావించాలి. ప్రజలిచ్చిన హోదాను సరైన విధంగా ఉపయోగించుకోకపోతే భవిష్యత్తులో రాజకీయంగా రాణించలేరు. అసెంబ్లీలో పనితీరు ఆధారంగానే పదోన్నతులు వస్తాయి. సభలో అందరికీ వెసులుబాటుగా ఉండడం కోసం అత్యంత చారిత్రక భవనంలో శాసనమండలి నిర్వహిస్తున్నాం. అసెంబ్లీలో దుద్దిళ్ల శ్రీపాదరావు పేరిట సెంట్రల్ హాల్ ఏర్పాటు చేశాం.

### 22ఏలో కోటి ఎకరాలు అవాస్తవం

22ఏ అనేది అభూత కల్పన మాత్రమే. ఈ జాబితాలో కోటి ఎకరాలు ఉన్నాయని ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఉన్న భూములే ఇప్పుడూ ఉన్నాయి. ప్రైవేటు వివాదాలున్నవి కేవలం 3 లక్షల ఎకరాలు మాత్రమే. ధరణిలో భారీ ఎత్తున అరాచకాలు చేశారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోనే బీఆర్ఎస్ నేత ఒకరి పేరిట వెయ్యి ఎకరాలు ఎక్కించుకున్నారు. వీటన్నింటిపైనా విచారణ చేయిస్తున్నాం. అన్నీ ఒకొక్కటిగా బయటకు వస్తాయి. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సహకారంతోనే దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. ఎల్‌నినో కారణంగా వచ్చే 10 నెలలు కూడా ఇబ్బంది ఉంటుంది. కరువు వచ్చే ప్రమాదం ఉంది. ఎమ్మెల్యేలు సాగునీటిపై కాకుండా తాగునీటిపై ఫోకస్ చేయాలి. కొందరు కాంగ్రెస్ పార్టీ ద్వారా ఎదిగి అదే కాంగ్రెస్ పార్టీకి నష్టం చేయాలని చూస్తున్నారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోతే సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డిలు రాష్ట్ర స్థాయి నేతలుగా ఎదిగేవారా?'అని సీఎం ప్రశ్నించారు. వెయ్యి రోజుల పాలనకు సహకరించిన సీఎల్పీకి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

### ఇంటింటికీ పథకాల ప్రచారం జరగాలి: భట్టి విక్రమార్క

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సభ్యులందరం కలిసి పనిచేస్తే కుట్రలను ఎలా ఛేదించగలమో చేసి చూపించామని అన్నారు. బీఆర్ఎస్ నేతల తీరు, వారి భాష, వివక్ష పూరిత కార్యకలాపాల గురించి రాష్ట్ర ప్రజానీకానికి తెలియజేసి కట్టడి చేయగలిగామని అన్నారు. అందరం ఒకటే మాట, ఒకటే బాటగా ఇదే పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రచారం చేసుకోవడంలో వెనుకబడుతున్నామన్నారు. సరైన విధంగా ప్రచారం చేసుకుంటే ఆ ప్రవాహంలో ప్రతిపక్షాలు కొట్టుకుపోతాయని చెప్పారు. ప్రజా ప్రభుత్వం చేసిన పనులను ప్రతి గ్రామంలో ఇంటింటికీ ప్రచారం చేయాలని కోరారు.

### తెలంగాణలోనే సామాజిక న్యాయం: పీసీసీ చీఫ్

సామాజిక న్యాయం తెలంగాణలోనే అమలవుతోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ బీసీ కాకపోయినా బీసీలకు రిజర్వేషన్ల కోసం ముందుకొచ్చారని, కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం సహకరించడం లేదని విమర్శించారు. కాగా రాష్ట్రంలో పరిస్థితులను పలువురు మంత్రులు సీఎల్పీకి వివరించారు. ఎల్‌నినో ప్రభావం, నీటి సమస్యపై మంత్రి ఉత్తమ్, జనగణనలో బీసీ కాలమ్ గురించి పొన్నం, 22ఏ భూముల జాబితా గురించి పొంగులేటి, పాలిటెక్నిక్ విద్యార్థుల అంశంపై మంత్రి వివేక్‌లు వివరించారు.

### యాష్కీకి సీఎం శుభాకాంక్షలు

ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్‌గా ఎంపికైన మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం సీఎల్పీ సమావేశం అనంతరం.. అసెంబ్లీ కమిటీ హాల్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు యాష్కీకి శుభాకాంక్షలు తెలియజేశారు.

## నినాదాల హోరు.. పాటల జోరు

-మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, ఎల్.రమణ, దాసోజు శ్రవణ్, శంభీపూర్ రాజు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎంసీ కోటిరెడ్డి, వాణీదేవి, నవీన్‌రావు తదితరులు వెల్‌వైపు దూసుకొచ్చారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ చర్చకు పట్టుబట్టారు. ప్లకార్డులు తీసేయాలని చైర్మన్ పలుమార్లు విజ్ఞప్తి చేసినా వెనక్కి తగ్గలేదు.

### నినాదాల హోరు

'కుటుంబ పాలనకు వ్యతిరేకంగా పోరాడదాం..ముఖ్యమంత్రి భూ దోపిడీ నశించాలి..సీఎం కుటుంబ సభ్యులకు కేటాయించిన భూములను రద్దు చేయాలి..22ఏ నిషేధిత భూముల అంశంపై వెంటనే చర్చ చేపట్టాలి..'అంటూ బీఆర్ఎస్ సభ్యులు నినాదా లు చేశారు. వారు చైర్మన్ పోడియం వద్దకు వెళ్లకుండా మార్షల్స్ అడ్డుకున్నారు. ఈ సమయంలో శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు జోక్యం చేసుకున్నారు. ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన అన్ని అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే సభ మర్యాద పాటిస్తూ నిబంధనలు పాటించాలని సూచించారు. మరోవైపు ప్రశ్నోత్తరాలు కొనసాగించడంతో బీఆర్ఎస్ సభ్యులు పోడియం వద్దే నిలబడి తమ నిరసన కొనసాగించారు. దేశపతి శ్రీనివాస్, గోరటి వెంకన్న కాంగ్రెస్ పార్టీ విధానాలు, సీఎం రేవంత్‌కు వ్యతిరేకంగా నిరసన పాట లు పాడారు. దీనికి మిగిలిన ఎమ్మెల్సీలు చ ప్పట్లతో కోరస్ ఇచ్చారు. దీంతో సభలో తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంది. చైర్మన్ వారించినా బీఆర్ఎస్ సభ్యులు వెనక్కి తగ్గలేదు. అయినా ప్రశ్నోత్తరాలను కొనసాగించారు.

### నినాదాల కాగితం ప్రదర్శించిన శంభీపూర్ రాజు

ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతున్న సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు.. తీన్మార్ మల్లన్న పక్క సీటులోకూర్చుని అకస్మాత్తుగా తన జేబులోంచి 'బామ్మర్దికి అమృత్ టెండర్లు, తమ్ముడికి రావిరాల భూములు.. రైజింగ్ ఎనుముల ఫ్యామిలీ'అని నినాదాలు రాసి ఉన్న కాగితాన్ని ప్రదర్శించారు. దీనిపై చైర్మన్ గుత్తా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సభ్యులు తమ స్థానాల్లో కూర్చుంటే ప్రశ్నోత్తరాల తర్వాత వాయిదా తీర్మానంపై చర్చించే అవకాశం ఇస్తానని ప్రకటించారు. కాసేపటి తర్వాత ఇదే పరిస్థితి కొనసాగుతుండడంతో..22ఏ అంశంపై బీఆర్ఎస్ ఇచ్చిన వాయిదా తీర్మానం తిరస్కరిస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. దీనిపై బీఆర్ఎస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్టు ప్రకటించి బయటకు వెళ్లిపోయారు.

## జల విద్యుత్ ప్రాజెక్టులపై సోలార్ విద్యుత్

-మొదటిపేజీ తరువాయి

వివరించారు. త్వరలో స్పష్టమైన ప్రకటన చేస్తామన్నారు. నాగార్జునసాగర్, శ్రీశైలం, పులిచింతల, శ్రీరాంసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి, దేవాదుల, కుమురంభీం, పాలేరు, వైరా, మల్లన్నసాగర్, ఎల్ఎండీ, మిడ్‌మానేరు, పోచారం వంటి జలాశయాలను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. సాధారణ సోలార్ ప్రాజెక్టులతో పోలిస్తే ఫ్లోటింగ్ సోలార్ ఏర్పాటుకు వ్యయం ఎక్కువ అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) కింద మెగావాట్‌కు రూ.కోటి వరకు సహాయం అందించే పథకాన్ని ప్రకటించినా, అందులో కొన్ని ఇబ్బందులున్నాయన్నారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోందని భట్టి తెలిపారు. తాము అధికారంలోకి వచ్చినప్పుడు 15 వేల మెగావాట్లు గరిష్ట డిమాండ్ ఉంటే, ఈ నెల 9వ తేదీన అది 19 వేల మెగావాట్లకు చేరిందన్నారు.

### సోలార్ గ్రిడ్ ఏర్పాటు

అమ్రాబాద్‌లో సోలార్ పైలెట్ ప్రాజెక్టు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని భట్టి వెల్లడించారు. 80 గ్రామాలను పూర్తిగా సోలరైజ్ చేసి, అక్కడ మైక్రో గ్రిడ్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో భూమి లేని నిరుపేద కుటుంబాలకు ఫారెస్ట్ రైట్స్ యాక్ట్ కింద గతంలో పంపిణీ చేసిన సుమారు 6.70 లక్షల ఎకరాలను కూడా సౌర విద్యుత్ ప్రోత్సాహానికి వినియోగించే అవకాశాలను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. 'ఇందిరా సౌర గిరి జల వికాసం'పేరుతో పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

## వైఎస్ పేదల కోసం గుర్తించిన స్థలాలు నెల రోజుల్లో ఇస్తాం



హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నిరుపేదలకు ఇవ్వడానికి గుర్తించిన ప్రభుత్వ స్థలాలను లేఅవుట్ చేసిన వాటిని నెల రోజుల్లో పేదలకు ఇచ్చే ప్రయత్నం చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శాసనసభలో గురువారం ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన అంశాన్ని పలువురు సభ్యులు లేవనెత్తారు. సభ్యుల సందేహాలకు మంత్రి సమాధానమిస్తూ, 2024లో రాష్ట్ర ప్రభుత్వం సర్వే పూర్తి చేసి, ఆవాస్ యోజన అర్హత కలిగిన 11,56,929 కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిపారు. ఇది ఇప్పటికే పెండింగ్‌లో ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం 8 లక్షల ఇళ్లకు రూ.40 వేల కోట్లు ఖర్చు చేస్తోందని చెప్పారు. భవిష్యత్‌లో అర్హులకు మూడు, నాలుగో విడతలో కూడా ఇళ్లు ఇవ్వాలని ఆలోచిస్తోందని తెలిపారు.

### సమస్యలున్నాయి: రాజగోపాల్‌రెడ్డి

చిన్న చిన్న కారణాల వల్ల అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం లేదని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బతుకు దెరువు కోసం వాహనాలు కొనుక్కొన్నారని, అవి ఎప్పుడో పోయాయని, వారిని అనర్హులను చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని ఇళ్లు ఇస్తున్నామనేది కాదని, ఎంతమంది అర్హులకు ఇస్తున్నామన్నదే ముఖ్యం కావాలన్నారు. చర్చలో మనోహర్‌రెడ్డి, అక్బరుద్దీన్, మేడేపల్లి సత్యం, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

### అగ్రి పాలిటెక్నిక్ కాలేజీలను మెరుగుపరుస్తాం: మంత్రి తుమ్మల

రాష్ట్రంలో వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీలను ఆధునీకరిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 11 ప్రైవేటు అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రభుత్వం తనిఖీలు నిర్వహించిందని, ఇందులో ఆరు ప్రైవేటు కాలేజీల అనుబంధాన్ని రద్దు చేశామన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు మంత్రి బదులిచ్చారు. ప్రమాణాలు లేని కాలేజీల అనుమతి రద్దు చేశామని, కొన్ని కాలేజీల్లో ప్రమాణాల పరిశీలనకు ఓ కమిటీని వేశామన్నారు. ఈ చర్చలో పాల్గొన్న ఎమ్మెల్యే మదనమోహన్ మాట్లాడుతూ, సరైన ప్రమాణాలు లేకుండా వ్యవసాయ కాలేజీలకు అనుమతి ఇవ్వొద్దని చెప్పారు.అవసరమైన ఫ్యాకల్టీ ఉండాలని కసిరెడ్డి నారాయణరెడ్డి సూచించారు. కొత్త వంగడాలు, సరికొత్త వ్యవసాయ విధానాలపై ఆధునిక లేబొరేటరీలతో పరిశోధనలు జరగాలని మధుసూదన్‌రెడ్డి కోరారు. చర్చలో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు కూడా పాల్గొన్నారు.

### హజ్‌హౌస్‌పై స్పష్టత ఇవ్వాలి: అక్బర్

హజ్‌హౌస్‌లో సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ కోరారు. ఇతరులను మనం అనుసరించాల్సిన అవసరం లేదని, బెంగళూరులోని హజ్‌హౌస్‌ను ఉద్దేశించి అన్నారు. పహాడీషరీఫ్ వద్ద కొత్త హజ్‌హౌస్ నిర్మాణంపై అక్బర్ పలు ప్రశ్నలు వేశారు.

## వీరనారి చాకలి ఐలమ్మ సేవలు చిరస్మరణీయం

- వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి



సీకే న్యూస్ ప్రతినిధి వనపర్తి జిల్లా తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆమె సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.
అన్యాయాన్ని, దొరల పెత్తనాన్ని ధైర్యంగా ఎదిరించి, పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం ఆమె సాగించిన పోరాటం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఐలమ్మ ఆశయాలను కొనసాగించడమే ఆమెకు అందించే నిజమైన నివాళి అని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వీరనారి చాకలి ఐలమ్మకు ఆయన హృదయపూర్వక నివాళులు అర్పించారు.

## షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధము

- ప్రమాదంలో తీవ్రముగా గాయపడ్డ రోడ బిచ్చన్న
- గాయపడిన వారిని పరామర్శించిన
- మాజీ జడ్పిటిసి కేసిరెడ్డి వెంకటరమణ చిన్నారెడ్డి





సికే న్యూస్ కొల్లాపూర్ ప్రతినిధి :చిన్నంబావి మండల పరిధిలోని గూడెం గ్రామంలో తెల్లవారు జామున రోడ్డ బిచ్చన్న అనే వ్యక్తి ఇంట్లో షార్ట్ సర్క్యూట్తో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రొడ్డ బిచ్చన్నకు తీవ్ర గాయాలయ్యాయి, ఇంట్లో వస్తువులు పూర్తిగా ఖాళీ బూడిదయ్యాయి. బీరువాలో ఉన్న వస్తువులు డాక్యుమెంట్స్ పాసు బుక్కులు సర్టిఫికెట్స్ నగదు బంగారం పూర్తిగా ఖాళీ బూడిదగా మారిపోయాయి. ఈ ప్రమాదంలో గాయపడిన రోడ్డ బిచ్చన్నను అంబులెన్స్ సహాయంతో వీపనగండ్ల హాస్పిటల్ కి తరలించడం జరిగింది. బిచ్చన్న పరిస్థితి చాలా సీరియస్ గా ఉండటంతో అక్కడి నుంచి వనపర్తి గవర్నమెంట్ హాస్పిటల్ కు తరలించడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న చిన్నంబావి మండల మాజీ జడ్పిటిసి కేసిరెడ్డి వెంకట్రావు అమ్మ హుటాహుటిన వనపర్తి ప్రభుత్వ హాస్పిటల్ కు చేరుకొని రొడ్డ బిచ్చనను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించి మనోధైర్యానిచి ప్రమాద వివరాలు తెలుసుకొని సంబధిత అధికారులతో మాట్లాడి ప్రభుత్వ అధికారులు తక్షణమే గూడెం గ్రామంలో షాక్ సర్క్యూట్ తో దగ్ధమైన ఇంటిని సందర్శించి ఆ కుటుంబ పెద్దదిక్కు రోడ బిచ్చన్నను అందుకోవాలని ప్రభుత్వం తక్షణమే స్పందించి సహకరించవలెనని అధికారులను కోరారు. ఈ పరామర్శలో మాజీ జడ్పీటీసీ కేశిరెడ్డి వెంకట్రావమ్మ చిన్నారెడ్డి, గూడెం గ్రామ సర్పంచ్ వెంకటరెడ్డి, శివ, స్థానిక గ్రామ ప్రజలు రొడ్డ బిచ్చనను పరామర్శించి మనోధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు.

## చింతకాని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు షూస్, సాక్స్ పంపిణీ చేసిన సర్పంచ్ కిలారు మనోహర్ బాబు



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఎడ్యుకేషనల్ కిట్స్ స్కీమ్'లో భాగంగా చింతకాని గ్రామంలోని ప్రభుత్వ ప ఉన్నత పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా బూట్లు (షూస్), సాక్స్‌లను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కిలారు మనోహర్ బాబు విద్యార్థులకు స్వయంగా షూస్, సాక్స్‌లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, కార్పొరేట్ పాఠశాలల విద్యార్థుల తరహాలో మెరుగైన రూపాన్ని, సౌకర్యాన్ని కల్పించాలనే ఉన్నతాశయంతో ప్రభుత్వం విద్యార్థుల పాదాల కొలతలకు అనుగుణంగా సరైన సైజులలో ఈ కిట్లను అందిస్తోందని తెలిపారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.లి
ఈ కార్యక్రమంలో సెక్రటరీ రమేష్ బాబు ఉపసర్పంచ్ కోలా ఉమారాణి , వార్డు మెంబెర్స్ కిలారు బాబురావు షేక్ రహిమతుల్లా పొనుగోటి బాబు వేముల ఆకాష్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# బూడిద రవాణాపై నిర్లక్ష్యం..

- పరిమితికి మించి లోడుతో రాకపోకలు..
- బూడిద లారీల దుమ్ముతో వాహనదారుల అవస్థలు
- ఖమ్మం - కొత్తగూడెం ప్రధాన రహదారిపై ప్రమాదాల ముప్పు
- కవర్లు సక్రమంగా లేక రోడ్డుపైకి బూడిద..
- నంబర్ ప్లేటు లేని వాహనాలపై అధికారుల నిఘా ఎక్కడ?




సీకే న్యూస్ ఖమ్మం జిల్లా ప్రతినిధి ఇస్లావత్ నరసింహా సెప్టెంబర్ 10 2026: ప్రధాన రహదారులపై బూడిదను తరలిస్తున్న లారీలు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. కొత్తగూడెం నుంచి ఖమ్మం వైపు నిత్యం భారీగా బూడిద లోడుతో లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ వాహనాలు సుజాతనగర్, జూలూరుపాడు, ఏన్కూరు, తల్లాడ, వైరా మీదుగా ఖమ్మం వైపు వెళ్తుండటంతో ఆయా మార్గాల్లో ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు.
బూడిదను తరలించే సమయంలో లారీలపై ఏర్పాటు చేయాల్సిన రక్షణ కవర్లు సక్రమంగా లేకపోవడంతో గాలికి బూడిద ఎగిరి రోడ్డుపైకి, వెనుక నుంచి వచ్చే వాహనదారులపైకి చేరుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా లారీల వెనుక ప్రయాణించే ద్విచక్ర వాహనదారులకు ఈ సమస్య తీవ్రంగా మారుతోంది. బూడిద కళ్లలో పడితే క్షణకాలం పాటు చూపు మందగించే అవకాశం ఉండటంతో వాహనంపై నియంత్రణ కోల్పోయి ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
కొన్ని బూడిద లారీల్లో వాహనం సామర్థ్యానికి మించి లోడును తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధిక లోడుతో పాటు సరైన కవర్లు లేకుండా బూడిదను తరలించడం వల్ల రహదారిపై బూడిద చిందుతూ ఇతర వాహనదారులకు ప్రమాదకరంగా మారుతోందని స్థానికులు అంటున్నారు.
ఫొటోలో కనిపిస్తున్న లారీ వెనుక భాగంలో నంబర్ ప్లేటు స్పష్టంగా కనిపించకపోవడంపైనా వాహనదారులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. వాహనాలకు నంబర్ ప్లేట్లు, అనుమతులు, లోడ్ పరిమితి, రక్షణ చర్యలు వంటి అంశాలను అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు.
కొత్తగూడెం నుంచి ఖమ్మం వరకు సుజాతనగర్, జూలూరుపాడు, ఏన్కూరు, తల్లాడ, వైరా మీదుగా నిత్యం బూడిద లారీలు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.బూడిద రవాణా వాహనాలు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా? నిర్దేశిత లోడ్ పరిమితిని పాటిస్తున్నాయా? లోడ్ మొత్తాన్ని పూర్తిగా కప్పి తరలిస్తున్నారా? వాహనాలకు నంబర్ ప్లేట్లు, అవసరమైన అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై రవాణా శాఖ, పోలీసు అధికారులు తనిఖీలు నిర్వహించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.
ప్రధాన రహదారులపై ఇప్పటికే ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండగా, బూడిద లారీల నుంచి ఎగిరివచ్చే బూడిద కారణంగా వాహనదారుల చూపు దెబ్బతిని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితి ఏర్పడకముందే అధికారులు స్పందించి బూడిద రవాణా వాహనాలపై కఠిన నిఘా పెట్టాలని కోరుతున్నారు.
నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై చర్యలు తీసుకోవడంతో పాటు, బూడిద రోడ్డుపై చిందకుండా పూర్తిస్థాయి కవర్లు ఏర్పాటు చేసి తరలించేలా అధికారులు చర్యలు చేపట్టాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

## బిఆర్ఎస్ కార్యకర్త నాగ మద్దిలేటి ని పరామర్శించిన



చిన్నంబావి మండల భారత రాష్ట్ర సమితి నాయకులు

సీకే న్యూస్ కొల్లాపూర్ ప్రతినిధి : చిన్నంబావి మండల పరిధిలోని వెల్టూరు గ్రామానికి చెందిన భారత రాష్ట్ర సమితి కార్యకర్త నాగమద్దిలేటి గత కొన్ని రోజుల క్రితం బైకు ప్రమాదానికి గురై ఎడమ చెయ్యి ప్యాక్చర్ అయినది. ఈ విషయం తెలుసుకున్న తెలుసుకొన్న చిన్నంబావి మండల భారత రాష్ట్రానికి నాయకులు, కార్యకర్తలు, బాధిత కుటుంబం వెల్లటూరు గ్రామంలోని వారి ఇంటి దగ్గరకు వెళ్లి నాగమద్దిలేటికి ప్రమాద ఎలా జరిగింది అనే వివరాలు అడిగి తెలుసుకుని ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకొని త్వరగా కోలుకొని బయటికి రావాలని వారికి వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పారు. బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటుంది అని ఈ సందర్భంగా అన్నారు. నాగమద్దిలేటి కుటుంబానికి వడ్డేమాన్ రామకృష్ణుడు 3000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. అలాగే తగరం ఉగ్ర నరసింహ కూడా నాగమద్దిలేటి కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సహాయం ఇచ్చి మేమున్నామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో నాగ మద్దిలేటి కుటుంబాన్ని పరామర్శించిన చిన్నంబావి మండల భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకులు స్వామి, వడ్డేమాన్ రామకృష్ణుడు, కేతపాగ సుధాకర్, సంకటి మద్దిలేటి, కత్తి నారాయణ ఉగ్ర నరసింహ, బిసన్న, హిట్లర్ నరసింహ, తగరం నాగరాజు, రవి, రాజేష్, తగరం కృష్ణ, తోళ్ల నాగేంద్రం తగరం శ్రీనివాస్, వెంకటేష్ మరియు తగరం నాగేష్, తదితరులు పరామర్శించి త్వరగా కోలుకోవాలని అలాగే చిన్నంబావి మండల పరిధిలోని ఏ ఒక్క బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తకు ఏ ఆపద వచ్చిన చిన్నంబావి మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు ముందుంటారని ఈ సందర్భంగా తెలియజేశారు.

## గూడెం గ్రామం లో షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధం రూ.10 లక్షల ఆస్తి నష్టం

- 50 వేల నగదు రెండు తులాల బంగారం బుగ్గిపాలు
- పొగతో బిచ్చన్నకు తీవ్ర గాయాలు.. వనపర్తి ఆస్పత్రికి తరలింపు
- 10 లక్షల ఆస్తినష్టం సిలిండర్ పేలకపోవడంతో తప్పిన పెను ముప్పు

సీకే న్యూస్ కొల్లాపూర్ ప్రతినిధి :తెల్లవారుజామున అంతా నిద్రలో ఉండగా ఒక్క సారిగా మంటలు చెలరేగాయి. చూస్తుండగానే ఇల్లు అగ్నికి ఆహుతైంది. ఇంట్లోని సామగ్రి, నగదు, బంగారం, పుస్తకాలు, ధ్రువపత్రాలు అన్నీ కాలి బూడిదయ్యాయి. కుటుంబ సభ్యులు తృటిలో ప్రాణాలతో బయటపడగా.. ఇంటి యజమాని బిచ్చన్న పొగతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాద ఘటన చిన్నంబావి మండలం గూడెం గ్రామంలో బుధవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో చోటుచేసుకుంది.

### క్షణాల్లో వ్యాపించిన మంటలు

గూడెం గ్రామానికి చెందిన రొడ్డ బిచ్చన్న ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ ఇంటిని కమ్ముకోవడంతో కుటుంబ సభ్యులు అప్రమత్తమై బయటకు పరుగులు తీశారు. దీంతో పెను ప్రాణనష్టం తప్పింది. కానీ ఇంట్లోని వస్తువులేవీ మిగలలేదు.

### నగదు.. బంగారం బుగ్గిపాలు

మంటల్లో ఫ్రిజ్, కూలర్, టీవీ, వాషింగ్ మిషన్, డ్రెస్సింగ్ టేబుల్, బీరువా తదితర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. దుస్తులు, బియ్యం, తినుబండారాలు, పుస్తకాలు, సర్టిఫికెట్లు, కీలక పత్రాలు బూడిదయ్యాయి. బీరువాలో ఉన్న రూ. 50 వేల నగదు, రెండు తులాల బంగారం సైతం మంటల్లో కాలిపోయినట్లు బాధితులు తెలిపారు.

### పొగతో బిచ్చన్నకు తీవ్ర గాయాలు

మంటల సమయంలో ఇంట్లో ఉన్న బిచ్చన్న దట్టమైన పొగతో తీవ్ర అస్వస్థతకు గురై గాయపడ్డారు. వెంటనే 108 అంబులెన్స్‌లో వీపనగండ్ల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

### కట్టుబట్టలతో వీధిన పడ్డ కుటుంబం

ఇల్లు, ఇంట్లోని సామగ్రి మొత్తం కాలిపోవడంతో కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది. కళ్లముందే సర్వస్వం కాలిపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 10 లక్షల మేర ఆస్తినష్టం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

### పేలని సిలిండర్.. తప్పిన భారీ ప్రమాదం

ఇంట్లో గ్యాస్ సిలిండర్ ఉండటంతో మంటలు చెలరేగిన సమయంలో గ్రామస్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. సిలిండర్ పేలి ఉంటే పరిస్థితి మరింత విషమించి భారీ ప్రాణనష్టం జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు. అదృష్టవశాత్తూ సిలిండర్ పేలకపోవడంతో పెను ముప్పు తప్పింది.

### మంటలపై పోరాడిన గ్రామస్థులు

మంటలు కనిపించగానే గ్రామస్థులు పెద్ద సంఖ్యలో ఘటనాస్థలానికి చేరుకున్నారు. నీటితో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అనంతరం కొల్లాపూర్ నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు.

### ఘటనాస్థలంలో ఎస్సై రామన్ గౌడ్ పరిశీలన

సమాచారం అందుకున్న చిన్నంబావి ఎస్సై రామన్‌గౌడ్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### బాధితులకు సర్పంచ్ పరామర్శ

గూడెం సర్పంచ్ కొత్త వెంకటరెడ్డి వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న బిచ్చన్నను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి పరిస్థితిని అడిగి తెలుసుకుని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని గ్రామస్థులు కోరారు.









## రైతు సలహా కమిటీ నూతన సభ్యుల ఎంపిక

- ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రత్యేక చొరవతో వనపర్తి నియోజకవర్గానికి 10 మందికి అవకాశం





సీకే న్యూస్ ప్రతినిధి వనపర్తి జిల్లా
రైతుల సమస్యలు, సూచనలు, అవసరాలను జిల్లా స్థాయిలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ఆత్మ ఆధ్వర్యంలో జిల్లా రైతుల సలహా కమిటీ (ఐఏసీ)ని ఏర్పాటు చేశారు.
జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి చైర్మన్‌గా, పెద్దమందడి మండలం చిన్నమందడి గ్రామ మాజీ సర్పంచ్ విట్ట సూర్యచంద్రారెడ్డి వైస్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు.
వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవతో మొత్తం 30 మంది సభ్యులతో ఏర్పాటు చేసిన కమిటీలో వనపర్తి నియోజకవర్గానికి చెందిన 10 మంది రైతులకు అవకాశం లభించింది.
కమిటీ సభ్యులు
విట్ట సూర్యచంద్రారెడ్డి -- వైస్ చైర్మన్, చిన్నమందడి
ఇటిక్యాల ప్రవీణ్ కుమార్ రెడ్డి -- పెద్దమందడి
కార్పునోల్ల ప్రభాకర్ రెడ్డి -- ఖిల్లా ఘణపురం
రాగనమోని మల్లేష్ -- ఖిల్లా ఘణపురం
కొతకాపు చంద్రశేఖర్ రెడ్డి -- వనపర్తి
కొత్తసమర సింహారెడ్డి -- వనపర్తి
పుల్లూరు నీలవ్ రెడ్డి -- పెబ్బేరు
వడ్డెమాన్ నాగన్న -- గోపాల్‌పేట
గంట వెంకట్ రెడ్డి -- గోపాల్‌పేట
కటమోని రమేష్ -- ఏదుల
రైతుల సమస్యలు, పంటల సాగు, మార్కెటింగ్, వ్యవసాయ పథకాలు తదితర అంశాలపై రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి చేరవేయడంలో ఈ కమిటీ కీలక పాత్ర పోషించనుంది.
వనపర్తి రైతుల సంక్షేమానికి కమిటీ ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిటీ వైస్ చైర్మన్ సూర్యచంద్రారెడ్డితో పాటు సభ్యులందరికీ ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.

# ఏన్కూరు గురుకులంలో జేడీ ఆకస్మిక తనిఖీ

- పరిసరాలు, రికార్డులు, విద్యా కార్యక్రమాల పరిశీలన




**సీకే న్యూస్ ఖమ్మం జిల్లా ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఏన్కూరు సెప్టెంబర్ 10 2026:** ఏన్కూరు గురుకుల పాఠశాల, కళాశాలను పాఠశాల విద్యాశాఖ జేడీ మదన్‌మోహన్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను, వివిధ రికార్డులను పరిశీలించారు.

అనంతరం పీఎం శ్రీ పథకం అమలు తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే అటల్ టింకరింగ్ ల్యాబ్, ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ కార్యక్రమాల నిర్వహణతో పాటు విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ వివరాలను పరిశీలించారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో సాధించిన ఫలితాలను ప్రిన్సిపాల్ వేము రాజును అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థుల విద్యా ప్రమాణాలతో పాటు సమగ్ర అభివృద్ధికి మరింత కృషి చేయాలని జేడీ సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, అవసరమైన మౌలిక వసతులు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీసీ మాధవరావు, ఎఫ్ఏఓ శాంసన్, పాఠశాల ప్రిన్సిపాల్ వేము రాజు, ఏటీపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి: అదనపు కలెక్టర్ నగేష్

ఘనంగా చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలు



**సి కె న్యూస్ మెదక్ జిల్లా ప్రతినిధి:** గురువారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి లి అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ తో కలిసి చాకలి ఐలమ్మ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన గావించి, పూలమాలలు సమర్పించి, ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా లిఅదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో చెరగని ముద్ర వేసిన గొప్ప మహిళా యోధురాలని అన్నారు. సామాజిక అన్యాయం, జమీందారీ వ్యవస్థ, దోపిడీకి వ్యతిరేకంగా ఆమె ధైర్యంగా పోరాడి అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు.

1895లో జన్మించిన చాకలి ఐలమ్మ నిరుపేద కుటుంబంలో పుట్టి ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటూ, ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాటం చేశారని తెలిపారు. విస్నూర్ దేశ్‌ముఖ్ దోపిడీకి వ్యతిరేకంగా ఆమె చేసిన సాహసోపేతమైన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం, రైతాంగ ఉద్యమాల్లో ఆమె పోషించిన పాత్ర మహిళల ధైర్యసాహసాలకు నిదర్శనమని కొనియాడారు.

సమాజంలో అసమానతలను తొలగించేందుకు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ చావు డప్పు కార్యక్రమానికి పిలుపునిచ్చిన ఆడే గజేందర్

- తెలంగాణ సమాజానికి, ముఖ్యంగా దళిత సమాజానికి కేసీఆర్ ఫామ్‌హౌస్ నుంచి
- యటకు వచ్చి క్షమాపణ చెప్పాలి -- బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్



తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు చేసిన వ్యాఖ్యలు, అలాగే దళిత నాయకులు కేసీఆర్ ఫామ్‌హౌస్ ముట్టడికి ప్రయత్నించిన ప్రదేశాలను బీఆర్ఎస్ నాయకులు పసుపు నీళ్లతో శుద్ధి చేయడం వంటి ఘటనలను నిరసిస్తూ బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు

ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 11 గంటలకు తలమడుగు మండలం సుంకిడి గ్రామంలో భీంపూర్,తాంసి, తలమడుగు మండల నాయకులతో కలిసి కేసీఆర్ చావు డప్పు కార్యక్రమానికి ఆడే గజేందర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు దళిత, గిరిజన--ఆదివాసీ, ఓబీసీ, మైనారిటీ, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్, సేవాదళ్, కిసాన్ కాంగ్రెస్ తదితర విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆడే గజేందర్ పిలుపునిచ్చారు

# ఘనంగా ఎస్ జి ఎఫ్ ఆటల పోటీల బహుమతుల ప్రధానోత్సవం,

**బహుమతులు అందజేసిన, సర్పంచ్ స్రవంతి సతీష్**

**సెప్టెంబర్ 10 సీ కే న్యూస్ చేగుంట:** చేగుంట మండలంలో నిర్వహించినటువంటి ఎస్జీఎఫ్ పోటీలలో గెలుపొందినటువంటి క్రీడాకారులకు చేగుంట గ్రామ సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్ బహుమతులను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటలు శారీరక,మానసిక వికాసానికి,తోడ్పడతాయని, గెలుపు ఓటములు సమానంగా స్వీకరించడానికి, నాయకత్వశీ పెంపొందించడానికి దోహదపడతాయని అన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి నీరజ మాట్లాడుతూ ఆటలతోపాటు చదువులలో కూడా రాణించాలని జిల్లా స్థాయిలో జరిగే పోటీలలో చేగుంటను ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. ఈ సందర్భంగా అండర్ 17 బాయ్స్ వాలీబాల్ ప్రథమ స్థానం జడ్.పి.హెచ్.ఎస్ వడియారం, ద్వితీయ స్థానం జడ్పిహెచ్ఎస్ చందాయిపేట్, గర్ల్స్ లో ప్రథమ స్థానం స్పోర్ట్స్ స్కూల్, ద్వితీయ స్థానం జడ్.పి.హెచ్.ఎస్ ఇబ్రహీంపూర్, అండర్ 14 బాయ్స్ లో ప్రథమ స్థానం జడ్.పి.హెచ్.ఎస్ ఇబ్రహీంపూర్, ద్వితీయ స్థానం జడ్పిహెచ్ఎస్ వడియారం, గర్ల్స్ లో ప్రథమ స్థానం జడ్.పి.హెచ్.ఎస్ చందాయిపేట్, ద్వితీయ స్థానం జడ్.పి.హెచ్.ఎస్ ఇబ్రహీంపూర్, కబడ్డీ అండర్ 17 బాయ్స్ లో ప్రథమ స్థానం జడ్.పి.హెచ్.ఎస్ మక్క రాజుపేట్, ద్వితీయ స్థానం శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్, గర్ల్స్ లో ప్రథమ స్థానం జడ్పీహెచ్ఎస్ చందాయిపేట్, ద్వితీయ స్థానం కేజీబీవీ రెడ్డిపల్లి, అండర్ 14 బాయ్స్ లో ప్రథమ స్థానం జడ్పీహెచ్ఎస్ మక్కరాజుపేట్, ద్వితీయ స్థానం జడ్.పి.హెచ్.ఎస్ చందాయిపేట్, గర్ల్స్ లో ప్రథమ స్థానం స్పోర్ట్స్ స్కూల్, ద్వితీయ స్థానం కేజీబీవీ రెడ్డిపల్లి, ఖో ఖో అండర్ 17 బాయ్స్ లో ప్రథమ స్థానం జడ్పీహెచ్ఎస్ చందాయిపేట్, ద్వితీయ స్థానం గీత హై స్కూల్, గర్ల్స్ లో ప్రథమ స్థానం స్పోర్ట్స్ స్కూల్, ద్వితీయ స్థానం జడ్పిహెచ్ఎస్ చేగుంట, అండర్ 14 బాయ్స్ లో ప్రథమ స్థానం జడ్.పి.హెచ్.ఎస్ చందాయిపేట,ద్వితీయ స్థానం జడ్పీహెచ్ఎస్ రెడ్డిపల్లి, గర్ల్స్ లో ప్రథమ స్థానం స్పోర్ట్స్ స్కూల్, ద్వితీయ స్థానం జడ్పిహెచ్ఎస్ చందాయిపేట్, గెల్పొందారని మండల ఎజిఎఫ్ సెక్రటరీ శారద తెలిపారు. ఈ కార్యక్రమంలో మక్కరాజుపేట కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటరామిరెడ్డి, చందాయిపేట హెచ్ఎం విట్టల్ రెడ్డి, తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్, పిఆర్టియు మండల అధ్యక్షులు నాగరాజు, తపస్ మండల అధ్యక్షులు రావుల వెంకటేష్, టిపిటిఎఫ్ మండల అధ్యక్షులు నరసింహారావు, ఎస్ టి యు ప్రధాన కార్యదర్శి మనోహర్రావు, యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి మణిరామ్, టిపిటిఎఫ్ ప్రధాన కార్యదర్శి యాదగిరి, పీడీలు మంజులత, శంకర్, గిరిజ, రజిత, నరేష్,నవీన్ బాల్రాజ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# బ్యాంకులు రుణ లక్ష్యాలను సాధించాలి



- మొదటి త్రైమాసికం లో 1713.32 కోట్ల రుణాల పంపిణీ.
- లక్ష్య సాధన లో 24.33 శాతం పూర్తి.
- రైతులకు, మహిళా సంఘాలకు పెద్దపీట.
- బ్యాంక్ లోని పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి.
- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**సి కె న్యూస్ మెదక్ జిల్లా ప్రతినిధి**

జిల్లా ఆర్థిక వృద్ధి రేటు లో మెదక్ జిల్లా దూసుకుపోతుందనీ,ఈ ఆర్థిక సంవత్సరం లోనీ, మొదటి త్రైమాసికం లో నిర్దేశించుకున్న రుణ లక్ష్యాలను చేరుకోవడంలో బ్యాంకర్లు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేశాయని,

3 నెలల కాలంలోనే (ఏప్రిల్ 2026 నుండి జూన్ 2026 ) రూపాయలు 1713.32 కోట్ల రూపాయలు వివిధ రంగాలకు వివిధ రంగాలకు మంజూరు చేయడం గమనర్హం అన్నారు.

గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోనీ మినీ మీటింగ్ హాల్లో నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన లబ్ధిదారులకు అందడం లో బ్యాంకులు పాత్ర అత్యంత కీలకం అని మొదటి త్రైమాసికం లో నిర్దేశించిన లక్ష్యంలో 24.33 శాతం పూర్తి చేయడం బ్యాంకర్ల పనితీరును అర్థం పడుతుంది అని వ్యవసాయం స్వయం సహాయక సంఘాలు సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల రంగాల కు ప్రాధాన్యత నేస్తూ పంపిణీ చేసిన ఈ రుణాలు జిల్లాలో ఆర్థిక స్వాలంబనకు దోహదపడుతున్నాయి అని అన్నారు. గత ఆర్థిక సంవత్సరం లాగానే ఈ ఆర్థిక సంవత్సరం కూడా బ్యాంకర్లు మరియు జిల్లా అధికారులు సమన్వయం తో పనిచేసి 100% రుణ లక్ష్యాలను సాధించాలని ఆమె సూచించారు.

రంగాల వారీగా రుణాల పంపిణీ తీరు(రూ. కోట్ల లో

వ్యవసాయం

అనుబంధ రంగాలు - 936.80 కోట్లు.

మీవీజు రంగం. - 316.31 కొట్లు.

ూ౨ం+ మహిళా సంఘాలు- 144.28 కోట్లు,

గృహ రుణాలు. - 4.46 కోట్లు.

విద్య రుణాలు. - 0.93 కోట్లు.

ఇతర రంగాల మొత్తం -441.10 కోట్లు. అని వివరించారు. ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ సంక్షేమ శాఖల ద్వారా అందించే రుణాల దరఖాస్తులను పెండింగ్లో పెట్టకుండా త్వరగా పరిష్కరించాలని సూచించారు యువతకు ఉపాధి కల్పించే పీఎం ఈజిపి పీఎం విశ్వకర్మ వంటి పథకాలపై బ్యాంకర్లు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. బ్యాంకింగ్ రంగంలో పెరుగుతున్న మోసాల దృశ్య వినియోగదారులకు భద్రత కల్పించేందుకు కేవైసీ సురక్షిత బ్యాంకింగ్ కు మీ తొలి అడుగు పేరుతో జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించినట్లు అదరము కలెక్టర్ తెలిపారు పాత ఖాతాలో పేరుకుపోయిన లేదా క్లైమ్ చేయని డిపాజిట్ల వివరాలను తెలుసుకోవడానికి గూగుల్ ఉద్గం పోటోలను ఉపయోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు జీరో బ్యాలెన్స్ సేవింగ్స్ ఖాతాదారుల ఆధార్ పాన్ కార్డులతో తమ ఖాతాలను అప్డేట్ చేసుకోవాలని సూచించారు. రుణాలు ఇవ్వడమే కాకుండా ఇచ్చిన రుణాలు సకాలంలో తిరిగి వసూలు అయ్యేలా చూడాలని అధికారులకు కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు స్వయం సహాయక సంఘాల సభ్యులు రుణాలను వ్యాపారాల అభివృద్ధికి వాడుకొని సకాలంలో చెల్లించి బ్యాంకులతో సత్సంబంధాలు కలిగి ఉండాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ బాపూజీ, ఆర్బిఐ ప్రతినిధి హేమలత , నాబార్డ్ డీడీఎం కృష్ణ చైతన్య , వివిధ బ్యాంకులో ఏజీఎంలు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి.

సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని మండల కేంద్రంలోని కామ్రేడ్ గంగవరపు విజయకుమార్ భవన్లో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పార్టీ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ.. భూస్వామ్య, దొరల దోపిడీకి వ్యతిరేకంగా పేదలు, రైతులు, కూలీల హక్కుల కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమన్నారు. మహిళగా ఎన్నో అవమానాలు, అణచివేతలను ఎదుర్కొంటూనే భయపడకుండా దొరల పెత్తనాన్ని ఎదిరించి ప్రజల పక్షాన నిలిచిన ధీరవనిత ఐలమ్మ అని కొనియాడారు. నేటికీ పేదలు, రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్య పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. భూమి, ఉపాధి, విద్య, వైద్యం, సామాజికలి న్యాయం కోసం కమ్యూనిస్టు ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లి, దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమాలను కొనసాగిస్తామని తెలిపారు కార్యక్రమంలో బస్వాపురం గ్రామ సర్పంచ్ ఆవుల నరసింహారావు సిద్దిసాహెబ్ సాయి శంకరరావు ప్రసాద్ వెంకటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు .

# పోషకాహార లోప నిర్మూలనే లక్ష్యం: జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**సికె.న్యూస్.ఆదిలాబాదు:** తల్లి, పిల్లల ఆరోగ్య రక్షణతో పాటు జిల్లాలో పోషకాహార లోపాన్ని సంపూర్ణంగా నిర్మూలించడమే ధ్యేయంగా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం 9వ 'పోషణ మాసం' (పోషన్ అభియాన్) ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సెప్టెంబరు 9 నుంచి అక్టోబరు 8 వరకు నెల రోజుల పాటు 'మన అంగన్‌వాడీ - మన బాధ్యత' నినాదంతో జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందిస్తేనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా రక్తహీనత (అనీమియా) నివారణకు ఆహారంలో వైవిధ్యం పాటించాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతీరోజూ శు భ్రమైన వాతావరణంలో తాజా వేడి వంటకాలు అందేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. చిన్నారుల సమగ్ర మానసిక, శారీరక వికాసానికి తొలి నాళ్ల పోషణ, బాల్య విద్య ఎంతో కీలకమని తెలిపారు. 'ప్రధానమంత్రి మాతృ వందన యోజన' వంటి సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులైన లబ్ధిదారులందరికీ చేరవేయాలని సూచించారు. పిల్లల పెంపకంలో అధికారుల బాధ్యతతో పాటు తల్లిదండ్రుల పాత్ర, సమాజ భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన తెలంగాణ స్వప్నాన్ని సాకారం చేసేందుకు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. జిల్లాలోని ప్రతి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నిర్వహిస్తున్న ఆరోగ్య తనిఖీలు, అవగాహన సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

అనంతరం 9వ రాష్ట్రీయ పోషణ మహా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, జడ్పీ సీఈవో రవి, డిపిఓ రమేష్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మెప్మా పిడి రాజు, సిడిపిఓలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వీరవనిత చాకలి ఐలమ్మ 41 వ వర్ధంతి వేడుక ఘనంగా,బిఆర్ఎస్ యువ నాయకులుభాను ప్రసాద్ అధ్యక్షతన



సెప్టెంబర్ 10 సీ కే న్యూస్ చేగుంట:దౌల్తాబాద్ మండలంలోని ముబారసుపూర్ గ్రామంలో బిఆర్ ఎస్ పార్టీ మండల యూత్ నాయకులు భాను ప్రసాద్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు నిర్వహించారు, ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు, బిఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు భాను ప్రసాద్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ తెలంగాణ భూపోరాట వీరనారి, వారి జననం 1895, పాలకుర్తి వరంగల్ జిల్లా తెలంగాణ చరిత్రలో మొట్టమొదటిసారిగా ఒక్క సాధారణ మహిళ దొరను ఎదిరించింది ఐలమ్మ నే, ఆమె ధైర్యాన్ని చూసి కమ్యూనిస్టు నాయకులు ఆంధ్ర మహాసభ వాళ్ళు ఆమెకు అండగా నిలిచారు అప్పటినుండి 1946 నుండి రైతంగ పోరాటం మొదలైంది ఆమె పోరాటం ఫలితం విజయం అందించింది, ఒక మహిళ మొదలు పెట్టిన భూమి పోరాటం వేలాదిమంది రైతులకు స్ఫూర్తి నిజాం రాజును గడగడలాడించింది, అందుకే తెలంగాణ తొలి వీరనారి అంటారు 1985 సెప్టెంబర్ 10న ఆమె చనిపోయారు ప్రతి ఏటా సెప్టెంబర్ 26న ఆమె జయంతిని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా జరిగిస్తారు, ఒక్క మాటలో చెప్పాలంటే చాకలి మహిళా అయినా, దొరల గుండెల్లో నిద్రపోయిన ధైర్యం ఐలమ్మది అని అన్నారు, అందుకు నేను చాకలి కులంలో పుట్టినందుకు గర్విస్తున్నానని వారు తెలిపారు, ఈ కార్యక్రమంలో రమేష్, వెంకటేష్, రాజు, స్వామి పాల్గొన్నారు,

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలతో మధిర, ఎర్రుపాలెం మండలాలకు గోదావరి జలాలు

- మంత్రోచ్ఛారణల మధ్య గోదావరి జలాలకు ఘన స్వాగతం



మధిర సెప్టెంబర్ 10(సికె న్యూస్)ప్రతినిధి.మధిర, ఎర్రుపాలెం మండలాల రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నాగార్జునసాగర్ ఆయకట్టులోని రెండో జోన్‌కు సాగునీరు అందించేలా గౌరవ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క లి ఆదేశాల మేరకు లిసాగర్ కెనాల్ ద్వారా గోదావరి జలాలను విడుదల చేశారు.మధిర బ్రాంచ్ కెనాల్ ద్వారా మధిర మండలానికి, నిదానపురం మేజర్ ద్వారా మధిర, ఎర్రుపాలెం మండలాలకు సాగునీరు అందించే చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రోచ్చారణల మధ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సూరంశెట్టి కిషోర్ గోదావరి జలాలకు స్వాగతం పలికారు. కొబ్బరికాయలు కొట్టి, పూలతో తల్లి గోదావరి జలాలను స్వాగతించారు.(రైతుల పట్ల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవకు ఇదే నిదర్శనం. వర్షాభావ పరిస్థితుల్లో రైతుల సాగునీటి సమస్యలను ముందుగానే గుర్తించి, వారి ప్రయోజనాల కోసం భట్టి విక్రమార్క లి చూపిన ప్రత్యేక శ్రద్ధ, నిరంతర కృషి ఫలితంగానే మధిర, ఎర్రుపాలెం మండలాలకు గోదావరి జలాలు చేరుతున్నాయి. రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా అధికారులతో సమన్వయం చేసి గోదావరి జలాలను విడుదల చేయించిన లిభట్టి విక్రమార్క రైతు పక్షపాత వైఖరికి ఇది మరో నిదర్శనం. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, పులిబండ్ల చిట్టిబాబు, మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్, దుంప వెంకటేశ్వరరెడ్డి మధిర, ఎర్రుపాలెం మండలాల గ్రామ సర్పంచులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.
రైతుల సాగునీటి సమస్యను పరిష్కరించి, గోదావరి జలాలను మధిర, ఎర్రుపాలెం మండలాలకు అందించేందుకు ప్రత్యేక చొరవ చూపిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## కలెక్టర్ ను కలిసిన సిపిఎం పార్టీ బృందం,

- సాగర్ జలాలను విడుదల చేయాలని,
- మట్టి మాఫియా ఆగడాలు అడ్డుకట్ట వేయాలని వినతి పత్రం ,




మధిర సెప్టెంబర్ 10(సికె న్యూస్)ప్రతినిధి.ఎరుపాలెం మండల పరిధిలోని తాటిగూడెం రెవెన్యూ పరిధిలో జరుగుతున్న భూ రీ సర్వే ను ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ పరిశీలించడానికి వచ్చిన సందర్భంలో సిపిఎం పార్టీ బృందం కలెక్టర్ ను కలిసి భూ సర్వే గురించి అనేక విషయాలు తెలుసుకున్నారు.
మండలశీలో గల రైతుల వ్యవసాయ భూములు వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయని సాగర్ జలాలను విడుదల చేయాలని వినతిపత్రం అందించారు. మండలంలో విచ్చలవిడిగా అక్రమ మైనింగ్ యదేచ్ఛగా మట్టి మాఫియా రవాణా చేస్తున్నారని అట్టి మట్టి మాఫియా ఆగడాలను అరికట్టాలని కలెక్టర్ ను కోరారు. వీటి పైన స్పందించిన కలెక్టర్ సాగర్ జలాలను రెండవ జోన్ కి నీటిని విడుదల చేశామని మండలం మూడవ జోన్ లో ఉందని నీటిని విడుదల చేస్తామని చెప్పారని,మట్టి మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని తహసిల్దార్ సునీత ఎలిజిబెత్ ను ఆదేశించినట్లు సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య,మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు కూడెల్లి నాగేశ్వరరావు, గౌర్రాజు రాములు, తాళ్లూరు వెంకటనారాయణ వేముల వెంకటేశ్వరరావు, వీరంకి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మధిరలో జవ్వాజి ఆనందరావు ఆధ్వర్యంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మధిర సెప్టెంబర్ 10(సికె న్యూస్)ప్రతినిధి. మధిరలోని శ్రీమతి రేణుకా చౌదరి క్యాంప్ కార్యాలయంలో గురువారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలి నిర్వహించారు.
మాజీ కేంద్ర మంత్రి, ప్రస్తుత రాజ్యసభ సభ్యురాలు లిశ్రీమతి రేణుకా చౌదరి ముఖ్య అనుచరుడు జవ్వాజి ఆనందరావు ఆధ్వర్యంలో అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేదలకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైనమూడు చెక్కులను పంపిణీ చేశారు.
ఎంపీ శ్రీమతి రేణుకా చౌదరి సహకారంతో, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు సిఫారసుతో ఈ సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి.
చెక్కులు పొందిన లబ్ధిదారులు:
ఎదురు పద్మావతి రూ. 23,000 సిరిపురం గ్రామం
మడి వెంకన్న రూ. 27,500 ఇల్లూరు గ్రామం
కొండల అర్చన రూ. 16,000 ఇల్లూరు గ్రామం
మొత్తం రూ. 66,500 విలువైనయ మూడు చెక్కులను జవ్వాజి ఆనందరావు లబ్ధిదారులకు పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం



అందించినందుకు తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి , రాజ్యసభ సభ్యురాలు శ్రీమతి రేణుకా చౌదరి , వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు లబ్ధిదారులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి కార్లపూడి అప్పారావు, మధిర మండల నాయకులు అవ్వల గురుబ్రహ్మం, జల్లేపల్లి ప్రసాద్, బాదా సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొని చెక్కులను పంపిణీ చేశారు.

## =ుజ రిటైర్డ్ డ్రైవర్ మృతి

### నివాళులర్పించిన జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల రాజు

మధిర సెప్టెంబర్ 10 (సికె న్యూస్)ప్రతినిధి.మధిర: మున్సిపాలిటీ లడక్ బజార్‌కు చెందిన మధిర ఆర్టీసీ రిటైర్డ్ డ్రైవర్ అంతటి వెంకటేశ్వర్లు సెప్టెంబర్ 5న ఇంటి వద్ద అకస్మాత్తుగా గుండెపోటుకు గురయ్యారు. తొలుత హైకేర్ హాస్పిటల్‌లో, అనంతరం ఖమ్మం ఆరోగ్య హాస్పిటల్‌లో చికిత్స పొందారు. పరీక్షల్లో గుండెలో మూడు బ్లాకులు ఉన్నట్లు గుర్తించగా, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పొన్నం సుబ్బారావు సూచనలతో తొలుత ఒక బ్లాక్‌కు స్టెంట్ వేశారు.
ఆ తర్వాత ఆరోగ్యం మెరుగుపడి నడిచే స్థితిలో ఉన్నప్పటికీ, రెండో, మూడో బ్లాకుల చికిత్స విషయంలో కుటుంబ సభ్యులతో సరైన చర్చ జరపలేదని, వైద్యుల నిర్లక్ష్యంతోనే వెంకటేశ్వర్లు మృతి చెందారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. మృతికి అనంతరం డాక్టర్‌ను సంప్రదించగా "మీతో డిస్కస్ చేయలేదు.. అర్జెంట్" అని చెప్పినట్లు తెలిపారు. దీనికి సంబంధించిన రికార్డులు తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు.
హెల్త్ ఇన్సూరెన్స్ బీమా డబ్బుల కోసమే తొందరపాటు చికిత్స చేశారనే అనుమానం ఉందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఆరోపణలపై ఆసుపత్రి, వైద్యుల వివరణ తెలియాల్సి ఉంది.
నివాళులు అంతటి వెంకటేశ్వర్లు గారికి మాజీ ఖమ్మం జిల్లా జడ్పిటిసి చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగాల కమల్ రాజ్, అరిగే రజని శ్రీనివాసరావు,





యన్నంశెట్టి వెంకట అప్పారావు, వేల్పుల శివతో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఘన నివాళులు అర్పించారు.

## పేద ప్రజల బతుకులు మారటం కోసం పోరాడేది ఎర్రజెండా పార్టీలే



సిపిఎం మండల కార్యదర్శి కడియాల అప్పయ్య పోకల వెంకటేశ్వర్లు

గరిడేపల్లి సికె న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు

భూస్వాములు దేశ్ ముఖ్ లు జమీందారుల కు వ్యతిరేకంగా పోరాటం చేసి, వేలాది గ్రామాలను విముక్తి చేసి,
పది లక్షల ఎకరాల భూములను పేదలకు పంచిపెట్టిన ఘనత కమ్యూనిస్టు పార్టీది.తెలంగాణ సాయుధ పోరాటంలో పేదల పక్షాన పోరాటం చేసి నాలుగు వేల మంది అమరవీరులను త్యాగం చేసిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీది.తెలంగాణ సాయుధ పోరాటంలో పేద ప్రజల పక్షాన తుపాకులు పట్టుకుని సాయుధ పోరాటం చేసి వేలాది గ్రామాలను విముక్తి చేసి, లక్షలాది ఎకరాల భూములను పంచిపెట్టిన ఘనత కమ్యూనిస్టు పార్టీ దని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు అన్నారు.తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా ఈరోజు గరిడేపల్లి మండలం రంగాపురం గ్రామంలోని పోటు ఎర్రమ్మ, రాఘవయ్య గార్ల స్థూపాలను, అలాగే వెలిదండ గ్రామంలోని మేదరమెట్ల మట్టయ్య గారి స్తూపాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల బతుకులు మారాలంటే ఎర్రజెండా రాజ్యం రావటం ద్వారానే సాధ్యం అవుతుందని, ఎర్రజెండా రాజ్యం కోసం, సమ సమాజ నిర్మాణం కోసం ప్రజలందరూ పోరాడాల్సిన అవసరం ఉన్నదని ఆయన అన్నారు.
తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలలో ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని అమరవీరుల త్యాగాలను మరొక్కసారి స్మరించుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య,రంగాపురం గ్రామ సర్పంచ్ కట్ట కళ్యాణి, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు తిరగమల్ల కిరణ్,కట్ట అశోక్, గ్రామ కార్యదర్శి కుంభం వెంకన్న, తదితరులు పాల్గొన్నారు

## అర్ధరాత్రి బీఆర్ఎస్వీ నాయకుడి అరెస్ట్



జన అవషం ప్రతినిధి: శేరిలింగంపల్లి మండల్, మియాపూర్ 10.09.2026 నాడు తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో మియాపూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీసులు వడ్డెర రాజ్ తీంజ శేరిలింగంపల్లి ఇంచార్జ్ గారిని అరెస్ట్ చేశారు
ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా, ఎలాంటి స్పష్టమైన కారణం చెప్పకుండా బీఆర్ఎస్వీ నాయకులను ఇలా అక్రమంగా నిర్బంధించడం తీవ్రంగా ఖండిస్తున్నాం.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారూ...
ఇలాంటి అక్రమ అరెస్టులు, నిర్బంధాలు, బెదిరింపులతో బీఆర్ఎస్వీ గొంతును అణచలేరు.
ఎన్ని అడ్డంకులు వచ్చినా, ఎన్ని కేసులు పెట్టినా మేము భయపడేది లేదు. వెనక్కి తగ్గేది లేదు.
విద్యార్థుల హక్కుల కోసం బీఆర్ఎస్వీ ఎప్పుడూ విద్యార్థుల కొండలా అండగా నిలుస్తుంది.
విద్యార్థుల సమస్యలపై మా పోరాటం నిరంతరం కొనసాగుతుంది.
బీఆర్ఎస్వీ పోరాటం ఆగదు...
విద్యార్థుల కోసం మా గొంతు మూగబడదు! అని దీ=ాం నాయకుడు వడ్డెర రాజు చెపారుద

## ఉప సర్పంచు నాగరాజు భౌతికకాయానికి నివాళులర్పించిన బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి

బాసు హనుమంతు నాయుడు

సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల ఈరోజు గద్వాల నియోజకవర్గం కె.టి.దొడ్డి మండలం మైలగడ్డ గ్రామంలో ఉప సర్పంచు నాగరాజు గుండెపోటుతో మృతి చెందాడు... విషయం తెలుసుకొని వారి స్వగృహానికి వెళ్లి, ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి, నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి, అంత్యక్రియలకు ఖర్చులకు నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేశారు....
వీరి వెంట,ప్రతాప్,చక్రిధర్ రెడ్డి,శ్రీనివాస్ గౌడ్, జనార్దన్,నాగేష్,నరసింహులు, మున్నూరు వీరారెడ్డి,ప్రహ్లాద్,అరవిందు,ఊర్ల చిన్న వీరేష్,యుగంధర్,నరసింహులు,మరియు నాయకులు తదితరులు ఉన్నారు..

## గద్వాల నియోజకవర్గ రైతాంగానికి రిజర్వాయర్ 1.9 టీఎంసీ నుండి 15 టిఎంసి ల సమర్థ్యం పెంపును జీవో కాపీని నీటిపారుదల శాఖ మంత్రివర్యులు గద్వాల ఎమ్మెల్యే కి అందజేశారు..

ఈరోజు హైదరాబాద్ లోని మినిస్టర్ క్వార్టర్స్ నందు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గుడ్డెందొడ్డి రిజర్వాయర్ 1.9 టిఎంసి నుండి 15 టిఎంసి ల సమర్థ్యం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి జీవో కాపీని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి కి అందజేశారు.
ఎమ్మెల్యే మాట్లాడుతూ...
గద్వాల నియోజకవర్గ రైతాంగం ప్రజల అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేయడం జరుగుతుందని. సీఎం రేవంత్ రెడ్డి క్యాబినెట్ సమావేశంలో ప్రత్యేకంగా గద్వాల నియోజకవర్గానికి సంబంధించిన నీటిపారుదల గట్టు ఎత్తిపోతల పథకం, గుడ్డెందొడ్డి రిజర్వాయర్లకు నిధులు కేటాయించడం చాలా సంతోషకరమైన విషయం రైతాంగానికి శాశ్వతమైన నీటి సమస్యను పరిష్కరించే విధంగా ప్రభుత్వం దూరదృష్టితో ఆలోచించడం జరిగిందని.
గద్వాల నియోజకవర్గం రైతులకు రెండు పంటలకు చివరి ఆయకట్టు వరకు నీళ్లు అందించే విధంగా రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే విధంగా ప్రభుత్వం కృషి చేయడం రైతాంగానికి ఎంతో మేలు చేసిన విధంగా ఉన్నదని తెలిపారు.



భవిష్యత్తులో గద్వాల నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసే విధంగా సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గం కృషి చేయాలని గద్వాల నియోజకవర్గం రాష్ట్రంలోనె నెంబర్ వన్ స్థానంలో అభివృద్ధి చెందే విధంగా నా వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.
సీఎం రేవంత్ రెడ్డి కి, మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి కి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి, జూపల్లి కృష్ణారావు కి గద్వాల నియోజకవర్గ ప్రజల తరపున రైతాంగం తరపున హృదయపూర్వక ప్రత్యేకమైన ధన్యవాదాలు....
ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ శ్రీధర్ గౌడ్, జిల్లా సీనియర్ నాయకులు ఆలూరు రామయ్య శెట్టి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల చదువుకు ప్రభుత్వ అండ

- ప్రభుత్వ కళాశాల,పాఠశాలల విద్యార్థులకు బ్యాగులు.. షూస్.. సాక్సులు
- పెద్దేముల్ ఎంఈఓ పి.నర్సింగ్ రావు

**సికె న్యూస్ పెద్దేముల్ ప్రతినిధి, సెప్టెంబర్ 10:** ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల చదువుకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పెద్దేముల్ మండల విద్యాశాఖ అధికారి పి.నర్సింగ్ రావు అన్నారు.విద్యార్థులకు అవసరమైన బ్యాగులు,షూస్, సాక్సులను ప్రభుత్వం ఉచితంగా అందించేందుకు పెద్దేముల్ మండల విద్యా వనరుల కేంద్రానికి చేరవేసిందని తెలిపారు.ఈ సందర్భంగా పెద్దేముల్ ఎంఈఓ పి.నర్సింగ్ రావు మాట్లాడుతూ....

ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న విద్యా సామగ్రిని త్వరలో వివిధ కళాశాలలు,పాఠశాల ద్వారా అర్హులైన విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గించడంతో పాటు, విద్యార్థుల్లో చదువుపై మరింత ఆసక్తిని పెంచేందుకు ప్రభుత్వం ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.అందులో భాగంగా పెద్దేముల్ మండల పరిధిలోని పెద్దేముల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల కోసం 202 కళాశాల బ్యాగులు,పెద్దేముల్ బీసీ బాలుర వసతి గృహం విద్యార్థుల కోసం 66 స్కూల్ బ్యాగులు, 66 జతల తెల్లని షూస్, 132 జతల సాక్సులు వచ్చాయని తెలిపారు.అలాగే మంబాపూర్ మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల విద్యార్థుల కోసం 469 స్కూల్ బ్యాగులు, 400 జతల తెల్లని షూస్, 800 జతల సాక్సులు చేరినట్లు పేర్కొన్నారు.మారేపల్లి కేజీబీవీ విద్యార్థినుల కోసం 360 స్కూల్ బ్యాగులు, 360 జతల తెల్లని షూస్, 720 జతల సాక్సులు,పెద్దేముల్ సోషల్ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థుల కోసం



491 స్కూల్ బ్యాగులు, 640 జతల తెల్లని షూస్, 1,280 జతల సాక్సులు వచ్చినట్లు ఎంఈఓ వివరించారు.మండల పరిధిలోని చైతన్యనగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం 14 స్కూల్ బ్యాగులు కూడా విద్యా వనరుల కేంద్రానికి చేరినట్లు తెలిపారు.

**58 పాఠశాలలకు బ్లాక్ సాక్సులు**

పెద్దేముల్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉన్న మొత్తం 58 పాఠశాలల విద్యార్థుల కోసం బ్లాక్ కలర్ సాక్సులు కూడా వచ్చినట్లు ఎంఈఓ పి.నర్సింగ్ రావు తెలిపారు.విద్యార్థులకు చేరాల్సిన సామగ్రిని సంబంధిత పాఠశాలలు,కళాశాలలకు వీలైనంత త్వరగా తరలించి,అర్హులైన విద్యార్థులకు సక్రమంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**తల్లిదండ్రులకు ఆర్థిక ఊరట**

ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న బ్యాగులు, షూస్, సాక్సులతో విద్యార్థులకు పాఠశాలకు అవసరమైన సామగ్రి అందుబాటులోకి వస్తుందని ఎంఈఓ అన్నారు.ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల తల్లిదండ్రులకు ఇది కొంత ఆర్థిక ఊరటనిస్తుందని పేర్కొన్నారు.విద్యార్థుల చదువుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

# ప్రతిభకు పట్టం...17 మంది గురువులకు ఉత్తమ పురస్కారం

- విద్యార్థుల ఉన్నతికి, పాఠశాలల అభివృద్ధికి విశేష కృషి చేసిన వారికి గుర్తింపు
- అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులకు పురస్కారాలు మరింత ప్రోత్సాహాన్నిస్తాయి
- పెద్దేముల్ మండల విద్యాధికారి పి.నర్సింగ్ రావు

**సికె న్యూస్ పెద్దేముల్ ప్రతినిధి, సెప్టెంబర్ 10:** విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తూ,వారిని విద్యాపరంగా ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంతో పాటు పాఠశాలల అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తున్న ఉపాధ్యాయుల సేవలకు గుర్తింపు లభించింది.విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో విశేష పాత్ర పోషించిన పెద్దేముల్ మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 17 మంది ఉపాధ్యాయులను మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసినట్లు పెద్దేముల్ మండల విద్యాధికారి పి.నర్సింగ్ రావు తెలిపారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి పి.నర్సింగ్ రావు మాట్లాడుతూ..

ఉపాధ్యాయ వృత్తి కేవలం బోధనకు మాత్రమే పరిమితం కాదని, విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసే బాధ్యతాయుతమైన సేవ అని అన్నారు.ప్రతి విద్యార్థిలోనూ ప్రత్యేకమైన ప్రతిభ,సామర్థ్యం ఉంటుందని,దానిని గుర్తించి సరైన మార్గంలో నడిపించడం ఉపాధ్యాయుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు వారిలో సృజనాత్మకత, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములవుతూ,విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరచేందుకు వినూత్న బోధనా పద్ధతులను అవలంబించిన ఉపాధ్యాయుల సేవలను పరిగణనలోకి తీసుకుని ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియను నిర్వహించినట్లు తెలిపారు.బోధనలో ప్రతిభ, విద్యార్థుల ప్రగతి,పాఠశాల అభివృద్ధికి చేసిన కృషి,విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు చేపట్టిన కార్యక్రమాలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్లు వివరించారు.



**మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా 17 మంది ఎంపిక**

మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిలో ఎస్.మంజుల,తెలుగు ఉపాధ్యాయురాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తట్టేపల్లి,
పీ.లింగమూర్తి,గణిత ఉపాధ్యాయుడు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందూరు,
సి.జయమ్మ,తెలుగు ఉపాధ్యాయురాలు,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉర్దూ మాధ్యమం, ఇందూరు,అనిత,హిందీ ఉపాధ్యాయురాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, పెద్దేముల్,ఎం.వెంకట కృష్ణారెడ్డి, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు,ఆదర్శ పాఠశాల,కళాశాల, గొట్లపల్లి; కె.అన్నపూర్ణ,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,పెద్దేముల్, సీ.శైలజ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఇందూరు,జె.శృతి,సహాయక ఉపాధ్యాయురాలు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,పెద్దేముల్, కె.స్నేహలత,సహాయక ఉపాధ్యాయురాలు,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,బండపల్లి; సయ్యద్ మహబూబ్ పటేల్,ఉపాధ్యాయుడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,తట్టేపల్లి,కావలి రవీందర్, ఉపాధ్యాయుడు,మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల,గోపాల్‌పూర్; ఈ.బాల్‌రాజ్,ఉపాధ్యాయుడు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, హన్మాపూర్; జె.సౌజన్య, ఉపాధ్యాయురాలు,ప్రభుత్వ డీఎన్‌టీ పాఠశాల,కందనెల్లి తండా,ఎన్.అవంతి, ఉపాధ్యాయురాలు,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,హన్మాపూర్, సీహెచ్.అశ్విని,ఉపాధ్యాయురాలు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఇందూరు,సీహెచ్.సుజాత, సహాయక ఉపాధ్యాయురాలు,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,గిర్మాపూర్, ఎస్.అనూష,సహాయక ఉపాధ్యాయురాలు,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,తింసాన్ పల్లి లు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఉన్నారని అన్నారు.

**ఉత్తమ గురువులకు ఘనంగా సన్మానం**

ఎంపికైన మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ప్రభుత్వం తరఫున ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేయనున్నట్లు ఎంఈఓ నర్సింగ్ రావు తెలిపారు.నేడు( శుక్రవారం ) సెప్టెంబర్ 11న సాయంత్రం 4:30 నిముషాలకు తాండూరు పట్టణంలోని తులసి గార్డెన్‌లో ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే గురువుల సేవలను గుర్తించి గౌరవించడం ద్వారా ఉపాధ్యాయుల్లో మరింత బాధ్యత, ఉత్సాహం పెరుగుతుందని మండల విద్యాధికారి పి.నర్సింగ్ రావు అన్నారు.ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని అభినందిస్తూ, ఇదే స్ఫూర్తితో మరింత మంది ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యున్నతికి,పాఠశాలల ప్రగతికి కృషి చేయాలని ఆకాంక్షించారు.ఒక మంచి ఉపాధ్యాయుడి కృషి ఒక విద్యార్థి జీవితాన్నే కాదు..సమాజ భవిష్యత్తును సైతం మార్చగలదని ఆయన పేర్కొన్నారు.

# ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

**జిల్లా కార్యదర్శి పున్నం సారయ్యలి**

**సి కే న్యూస్,పాలకుర్తి :** భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వీరనారి చాకలి ఐలమ్మ పాత్ర చిరస్మరణీయమని పలువురు నాయకులు అన్నారు. తొర్రూరు పట్టణ కేంద్రంలో చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాటి భూస్వామ్య వ్యవస్థలో పేదలు, రైతులు, కూలీలు, వృత్తిదారులు తీవ్ర దోపిడీకి గురయ్యారని నాయకులు పేర్కొన్నారు. దొరల గడీల వద్ద ఉచితంగా పనిచేయడం, బట్టలు ఉతకడం, పశువులను శుభ్రం చేయడం తదితర వెట్టిచాకిరీ పనులు చేయాల్సిన దుస్థితి ఉండేదన్నారు. అలాంటి పరిస్థితుల్లో ఎవరి అండదండలు లేకుండానే ధైర్యం, ఆత్మవిశ్వాసంతో భూస్వామ్య పెత్తనాన్ని ఎదిరించిన ఐలమ్మ.. తన భూమి కోసం సాగించిన పోరాటాన్ని ప్రజల ఆత్మగౌరవ పోరాటంగా మలిచారని గుర్తుచేశారు. కమ్యూనిస్టుల సహకారంతో తన భూమిని కాపాడుకున్న ఐలమ్మ పోరాటం తెలంగాణ రైతాంగ ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచిందన్నారు. వేలాది మంది అమరులైన తెలంగాణ సాయుధ పోరాటం భూసంబంధ మార్పులకు, వెట్టిచాకిరీ నిర్మూలనకు పునాది వేసిందని తెలిపారు. సుమారు రెండువేల గ్రామాల్లో ప్రజా పాలనకు ప్రత్యామ్నాయ వ్యవస్థలు ఏర్పడి, లక్షల ఎకరాల భూమి పేదలకు దక్కిన విషయాన్ని గుర్తుచేశారు.



**మారిన వివక్ష రూపాలు**

ఐలమ్మ పోరాడిన వెట్టిచాకిరీ, కుల వివక్ష, దోపిడీ రూపాలు మారినప్పటికీ వాటి ఆనవాళ్లు నేటికీ కనిపిస్తున్నాయని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కులం, వృత్తి ఆధారంగా మనుషులను చిన్నచూపు చూడటం సమాజానికి ప్రమాదకరమన్నారు. శ్రమజీవుల సేవలను వినియోగించుకుంటూ వారినే సామాజికంగా వెలివేయడం ఎంతమాత్రం సమర్థనీయం కాదన్నారు. చట్టాలు మారినంత మాత్రాన వివక్ష పూర్తిగా తొలగిపోదని, ప్రజల ఆలోచనా విధానంలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. కులం కంటే మనిషికి, వృత్తి కంటే శ్రమకు గౌరవం ఇవ్వాలని పిలుపునిచ్చారు. రజకులు, నాయీబ్రాహ్మణులు, మత్స్యకారులు, కల్లుగీత కార్మికులు, ఇతర వృత్తిదారులకు సమాన గౌరవం, హక్కులు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

**ఐలమ్మ స్ఫూర్తితో ముందుకు సాగాలి**

నేటి యువతకు విద్య, విజ్ఞానం, సాంకేతికత, సమాచార వనరులు విస్తృతంగా అందుబాటులో ఉన్నాయని, వాటిని వ్యక్తిగత అభివృద్ధితోపాటు సమాజ అభ్యున్నతికి వినియోగించాలని సూచించారు. అన్యాయం ఎదురైతే ప్రశ్నించాలని, వివక్ష కనిపిస్తే వ్యతిరేకించాలని, బలహీన వర్గాల పక్షాన నిలవాలని కోరారు. ఎన్ని కష్టాలు ఎదురైనా వెనుకడుగు వేయకుండా ఆత్మగౌరవంతో పోరాడిన ఐలమ్మ మహిళా శక్తికి, సామాజిక సమానత్వానికి, హక్కుల పోరాటానికి ప్రతీకగా నిలిచారని కొనియాడారు. ఐలమ్మను కేవలం జయంతి, వర్ధంతి రోజుల్లో స్మరించుకోవడం కాకుండా ఆమె ఆశయాలను ఆచరణలో పెట్టినప్పుడే నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పున్నం సారయ్య, మహిళా నాయకురాలు ఓరుగంటి చైతన్య, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రావణ్ కుమార్, కౌన్సిలర్లు నాగరాజు, జంపన్న, మండల అధ్యక్షుడు నిమ్మల సోమయ్య, కార్యదర్శి పొడగంటి శేఖర్, పట్టణ అధ్యక్షుడు చింతల రాజు, ఓరుగంటి ప్రవీణ్, నడిపెద్ది కార్తీక్, లంక శ్రీకాంత్, కొండ్రాతి రామకృష్ణ, బిక్షం, వెంకటయ్య, యాకన్న, శ్రీనివాస్, నాగమల్లు, రాములు, యాకూబ్, సాంబయ్య, ఓరుగంటి సైదులు తదితర నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యానికి పర్యావరణనికి వ్యతిరేకంగా డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం సరికాదు

- పర్యావరణ పరిరక్షణే ప్రథమ ప్రాధాన్యత
- ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా డంపింగ్ యార్డు ఏర్పాటు సరికాదు
- సిద్దాపూర్ డంపింగ్ యార్డు జి.వో 641 వెంటనే రద్దు చేయాలి
- మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్
- బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్




**షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం సి కె న్యూస్ ప్రతినిధి సెప్టెంబర్ 10**

రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం పరిధిలోని సిద్దాపూర్ గ్రామ ప్రాంతంలో డంపింగ్ యార్డు ఏర్పాటు ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి ముప్పు కలిగించే నిర్ణయాలను ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ముందుకు తీసుకెళ్లడం సరికాదన్నారు. డంపింగ్ యార్డు వల్ల సమీప ప్రాంతాల్లో దుర్వాసన, వాయు కాలుష్యం, భూగర్భ జలాల కలుషితం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే జనావాసాల మధ్య పర్యావరణ సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలపై మరింత భారాన్ని మోపడం అన్యాయమన్నారు. "ప్రజలకు ఇబ్బంది కలిగించే అభివృద్ధి అవసరం లేదు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణే ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యత కావాలి. సిద్దాపూర్ డంపింగ్ యార్డు విషయంలో ప్రజల అభిప్రాయాన్ని గౌరవించి, ఈ ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలి" అని అంజయ్య యాదవ్ స్పష్టం చేశారు. సిద్దాపూర్ డంపింగ్ యార్డు రద్దు కోసం తెలంగాణ సమాఖ్య, ాణవూ జీూజ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజా ఉద్యమానికి తన పూర్తి మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు. ప్రజల న్యాయమైన డిమాండ్ పరిష్కారం అయ్యే వరకు ప్రజల తరఫున తన వాణిని వినిపిస్తానని పేర్కొన్నారు.

# ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి



**యాదాద్రి జిల్లా వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు, సెప్టెంబర్ 10.**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని వలిగొండ పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా ఉద్యమకారుల ఫోరం, వివిధ కుల సంఘాల నాయకులు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
బీసీ సంఘం అధ్యక్షుడు సాయిని యాదగిరి మాట్లాడుతూ చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని అన్నారు.దభూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం ఆమె చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు.
తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరమాతగా చాకలి ఐలమ్మను కొనియాడారు.
సామాజిక మార్పు కోసం ధైర్యంగా పోరాడిన స్త్రీ శక్తికి ఆమె ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.
ఆమె ధీర చరిత్ర ప్రజా పోరాటాలకు నేటికీ స్ఫూర్తినిస్తోందని నాయకులు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, నాయకులు క్రిస్టఫర్, మాజీ ఉపసర్పంచ్ పబ్బు సురేందర్ తదితరులు పాల్గొన్నారు.
ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్‌తో పాటు బోడిగే సుదర్శన్, ఎలిమినేటి సత్యనారాయణ, మైసొల్ల లక్ష్మీనర్సు, యాదగిరి, లక్ష్మయ్య, ఎండి కాసిం తదితరులు పాల్గొని ఐలమ్మకు నివాళులర్పించారు.

# ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి



**యాదాద్రి జిల్లా వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు, సెప్టెంబర్ 10.**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని వలిగొండ పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా ఉద్యమకారుల ఫోరం, వివిధ కుల సంఘాల నాయకులు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
బీసీ సంఘం అధ్యక్షుడు సాయిని యాదగిరి మాట్లాడుతూ చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం ఆమె చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు.
తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరమాతగా చాకలి ఐలమ్మను కొనియాడారు.
సామాజిక మార్పు కోసం ధైర్యంగా పోరాడిన స్త్రీ శక్తికి ఆమె ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆమె ధీర చరిత్ర ప్రజా పోరాటాలకు నేటికీ స్ఫూర్తినిస్తోందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, నాయకులు క్రిస్టఫర్, మాజీ ఉపసర్పంచ్ పబ్బు సురేందర్ తదితరులు పాల్గొన్నారు.
ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్‌తో పాటు బోడిగే సుదర్శన్, ఎలిమినేటి సత్యనారాయణ, మైసొల్ల లక్ష్మీనర్సు, యాదగిరి, లక్ష్మయ్య, ఎండి కాసిం తదితరులు పాల్గొని ఐలమ్మకు నివాళులర్పించారు.

## పొలాల అమావాస్య సందర్భంగా బసవన్నలకు పూజలు



సికె.న్యూస్.ఆదిలాబాదు ఆదిలాబాద్ : పొలాల అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రక్షణ సేన స్టేట్ అబ్సర్వర్ ౹=ూ పార్టీ ఇంచార్జ్ బోథ్ మాజీ ఎమ్మెల్యే శ్రీ రాథోడ్ బాపురావు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం లిటైలర్స్ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో తన బసవన్నలకు సంప్రదాయబద్ధంగా పూజలు చేసి, రైతులు, పశుసంపద సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

### రైతుల జీవితాల్లో పశుసంపదకు ప్రత్యేక స్థానం

వ్యవసాయ రంగంలో ఎద్దులు, పశువులు రైతులకు ఎంతో కీలకమని శ్రీ రాథోడ్ బాపురావు పేర్కొన్నారు. పొలాల అమావాస్య సందర్భంగా బసవన్నలను పూజించడం ద్వారా వ్యవసాయానికి, పశుసంపదకు ఉన్న అనుబంధాన్ని చాటుకుంటామని తెలిపారు. రైతులు పాడిపంటలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు, నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఉండి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఖమ్మంలో బీజేపీ మహాధర్నా

- కలెక్టరేట్ ధర్నా చౌక్‌లో పాల్గొన్న చింతకాని బీజేపీ మండల నాయకులు




సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి ఖమ్మం, సెప్టెంబర్ 10: తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు శ్రీ నారపునేని రామచంద్రరావు గారి పిలుపు మేరకు ఖమ్మం కలెక్టరేట్ ధర్నా చౌక్‌లో బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో చింతకాని మండలానికి చెందిన బీజేపీ నాయకులు పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి మహాధర్నాను విజయవంతం చేశారు.
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాగుతున్న వెయ్యి రోజుల అవినీతి పాలనను నిరసిస్తూ బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. అలాగే భూ భారతి చట్టం నుంచి 22ఏ నిషేధిత జాబితాను తొలగించాలని, విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ నాయకులు ఆరోపించారు. ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించి, ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
ఈ మహాధర్నాలో రాష్ట్ర, జిల్లా నాయకులతో పాటు చింతకాని బీజేపీ మండల నాయకులు కొండా గోపి, ఇమ్మడి సత్యనారాయణ, గోదా మంగయ్య, కొండ వెంకన్న, అనగాని రామారావు, ముంత అంజన సిద్ధార్థ, వేముల ఎల్లయ్య, పర్సగాని ఎల్లయ్య, పల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

ఎల్కూర్ లో ఘనంగా 41వ వర్ధంతి వేడుకలు -- సర్పంచ్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఘన నివాళులు




జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం ఎల్కూర్ గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను ఏలుకూరు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పి. వినోద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు, యువకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.
ఈ సందర్భంగా సర్పంచ్ పి.వినోద్ కుమార్ మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ ధైర్యం, తెగువ, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అన్యాయాన్ని ఎదిరించి, అణగారిన వర్గాల కోసం ఆమె చూపిన ధైర్యం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.
చాకలి ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, గ్రామ అభివృద్ధితో పాటు సామాజిక సమానత్వం కోసం అందరూ ఐక్యంగా పనిచేయాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత చాకలి ఐలమ్మ జీవిత చరిత్రను తెలుసుకుని ఆమె పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.
అనంతరం గ్రామ పెద్దలు, యువకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు మాట్లాడుతూ చాకలి ఐలమ్మకు ఘన నివాళులు అర్పించారు. గ్రామంలో ఇలాంటి మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా వారి సేవలు, పోరాటాలను భవిష్యత్ తరాలకు తెలియజేయవచ్చని అన్నారు.
ఈ కార్యక్రమం గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, కార్యకర్తలు, గ్రామపంచాయతీ అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వీర వనిత చాకలి ఐలమ్మ కు నివాళులర్పించిన ప్రజా ప్రతినిధులు...

సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :ఈ రోజు గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నందు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ గారి 41వ వర్ధంతి సందర్భంగా ఆయె చిత్రపటానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమెహన్ రెడ్డి ఆదేశాలు మేరకు ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్ పూలమాల వేసి నివాళులర్పించడం జరిగినది.
తెలంగాణ మహిళల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన వీర వనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు.
చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు .
ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్స్ బాబర్,చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్స్ తుమ్మల నరసింహులు యాదవ్, మురళి, జిల్లా డిసిసి వైద్య ఆరోగ్య వింగ్ అధ్యక్షుడు నర్సింగరావు, వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఆంజనేయులు,, నాయకులు గోవిందు , కురుమన్న , ప్రవీణ్, నాగేంద్ర యాదవ్, ధర్మనాయుడు, రామకృష్ణ శెట్టి, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, ఎం కె ప్రవీణ్, వెంకటేష్, షాషా, చిరు, నాగేష్, రామచంద్రుడు, నాగార్జున్, వెంకటేష్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## వినాయక చవితికి పోలీసుల ముందస్తు చర్యలు



సి కే న్యూస్, తొర్రూరు : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వర్ధన్నపేట సీఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సంజీవరావు గురువారం రాయపర్తి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందితో సమావేశమై పలు సూచనలు, సలహాలు అందించారు. విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం డీజే సౌండ్ సిస్టమ్ నిర్వాహకులకు కౌన్సెలింగ్ నిర్వహించి, నిబంధనలు పాటించాలని సూచించారు. శబ్ద కాలుష్యానికి కారణమయ్యే విధంగా డీజేలను వినియోగించరాదని, పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. అనంతరం వారిని ఎంఆర్ఓ సమక్షంలో బైండోవర్ చేశారు.
వినాయక చవితి వేడుకల నేపథ్యంలో ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా మైలారం రిజర్వాయర్ ను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. గణేష్ నిమజ్జనం సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు ఏర్పాట్లపై పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి ఎస్ఐ ముత్యం రాజేందర్, హెడ్ కానిస్టేబుల్ పొన్నం భాస్కర్, సంపత్, అనిల్‌కుమార్, నవ్య, సునీత, గణపతిరెడ్డి తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యను పక్కదారి పట్టించే విధంగా ఏకపక్ష నిర్ణయం మంచి పద్ధతి కాదు..

- నిందారోపణ ఎదుర్కొంటున్న వ్యక్తిపై డి ఐ ఈ ఓ సమగ్ర విచారణ చేపట్టాలి
- నాగులవంచ కళాశాల ప్రిన్సిపల్

సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.చింతకాని, సెప్టెంబర్10 కళాశాలలో ఎటువంటి విచారణ చేపట్టకుండా వారికి అనుకూలంగా సమస్యను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు నాగులు వంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్. ఈ సందర్భంగా వారు మీడియాకు ప్రకటన ద్వారా తెలియజేస్తూ
07:09. 2026 తేదిన ప్రభుత్వ జూనియర్ కళాశాల నాగులవంచ విద్యార్థులకు. "ఇంగ్లీష్ సబ్జెక్ట్ పట్ల వారికి జరుగుతునీకు
అన్యాయమును, నిర్లక్ష్యంను, వారి హక్కులను పొందుటకు చేపట్టినటువంటి
ధర్నాకు సంబందించిన అంశము పై
ది. 7/9/2026న వివిధ పత్రికలలో ప్రచురితం అయినటువంటి అంశములను ఆధారంగా
ఖమ్మం జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అదికారి కళాశాలకు విజిట్ చేయటం జరిగినది. ఆ సందర్భములో గ్రామ సర్పంచ్ భర్త నారగాని శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు ముత్తినేని వెంకటేశ్వర్లు ను
కళాశాలకు పిచ్చేసి, విద్యార్థులను, విచారించకుండా వారి సమస్యను తెలుసుకోకుండా, కళాశాలలోని విద్యార్థులను శాశ్విత పరిష్కారం
చూపకుండా, విద్యార్థులు బయటకు వెళ్ళుటకు ప్రిన్సిపాల్ మరియు కళాశాల స్టాఫ్ లోని
గల వర్గాలు కారణం అని నిందిస్తూ, మాలో కులమత వర్గ భేదాలు
వెనటువంటి వ్యవస్థలో ఇటువంటి ఆధారాలు లేకుండా సమస్యను పక్కదారి పట్టించే విధంగా
కొంత మందిని కుల పరంగా తీసుకొనివచ్చి
దళిత ప్రిన్సిపాల్ అయిన నని, నిత్యం విద్యార్థులకు అంకితం అయి పనిచేస్తున్నా
తనను తన స్టాప్ ను అవమానించి నిందారోపణ వ్యక్తిని ఎటువంటి విచారణ చేపట్టకుండా
నిరాధారం అయిన ఆరోపణలు చేసి, వ్యక్తిగత అవసరాలకు సమస్యను మరలించే విధంగా వ్యవహరించినట్లుగా భావిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలియజేశారు. మాలో ఎలాంటి
వర్గముగాని, విభేదములు గాని, లేవు, మేము అంతా ఒకటిగా ఒకే టీం గా కళాశాల ఉన్నతికి పాటుపడుతున్నట్లు ఒక పత్రికా ప్రకటన ద్వారా ప్రిన్సిపల్ తెలియజేశారు.

## తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు




సెప్టెంబర్ 10 (సీ కే న్యూస్) చేగుంట: తెలంగాణ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుక జై శ్రీరామ్ రజక సంఘం నాయకులు అధ్వర్యంలో నిర్వహించారు, చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. జై శ్రీరామ్ రజాక్ సంఘం నాయకులు మాట్లాడుతూ
తెలంగాణ రైతాంగ వీరవనిత పోరాటంలో గుర్తింపు పొందిన ఐలమ్మ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ చేసింది తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీరవనిత చాకలి ఐలమ్మ అని అన్నారు, దొరల గుండెల్లో భయాన్ని పుట్టించి వీర వనిత తెలంగాణ రటైతాంగ విప్లవాగ్ని చాకలి ఐలమ్మ అని వారు తెలిపారు,
ఈ కార్యక్రమంలో చేగుంట శ్రీ ఉజ్జయిని మహంకాళి టెంపుల్ అధ్యక్షులు సంద్రుకు సతీష్, చేగుంట ఉప సర్పంచ్ మహమ్మద్ రఫీ, ఉల్లి తిమ్మాయపల్లి సర్పంచ్, చేగుంట రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు,

## కొమట్లగూడెం అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా అన్నప్రాశన కార్యక్రమం



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.కొమట్లగూడెం: గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల కోసం అన్నప్రాశన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కొండూరి పరిశుద్ధరావు ముఖ్య అతిథిగా హాజరై చిన్నారి రూప అన్వితకు అన్నప్రాశన చేయించారు.గ్రామానికి చెందిన రాజశేఖర్, ఆయన సతీమణి లక్ష్మి దంపతుల కుమార్తె రూప అన్వితకు అన్నప్రాశన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, బాలల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకుంటూ, వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిదండ్రులు, గ్రామస్తులు సహకరించాలని కోరారు.
కార్యక్రమంలోఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్యారాణి, అంగన్వాడీ టీచర్ వాణి, అంగన్వాడీ సిబ్బంది మంగమ్మ, గ్రామ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలిత కుమారి, గ్రామ కార్యదర్శి రాధారాణి, కృష్ణారావు, చింతకాని వైద్యులు, అంగన్వాడీ ఆయాలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ 41 వ వర్ధంతి వేడుకలు



సెప్టెంబర్ 10 (సీ కే న్యూస్) చేగుంట :చేగుంట మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరవనిత, చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను గురువారం చేగుంట మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల రజక సంఘం సభ్యులు చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు.కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు శంకర్, ఉపాధ్యక్షుడు యాదగిరి, కార్యదర్శి రవి, సంఘం సభ్యులు బాలేష్, విజయ్, సాదుల్లా, శరత్, సురేష్, సాయిబాబా, శ్రీధర్, నర్సింలు, ఆంజనేయులు, నవీన్, సంపత్, మల్లేష్, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.ం

## శ్రీ చెన్నకేశవస్వామి యూత్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా.

- కిలారు జగన్ మోహన్ రావు ఢ సరోజినీ దంపతులు చేతుల మీదుగా కర్ర పూజా కార్యక్రమం.



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.చింతకాని శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానం రోడ్ నందు శ్రీ చెన్నకేశవ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తునటువంటి శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాలు 5 వ వార్షికోత్సవం సందర్భంగా మాజీ సాగునీటి సంఘం అధ్యక్షుడు శ్రీ కిలారు జగన్మోహన్ రావు సరోజినీ దంపతుల చేతుల మీదుగా కర్ర పూజ కార్యక్రమం
నిర్వహించడం జరిగింది.
ఈయొక్క కార్యక్రమంలో 6వ వార్డు మెంబర్ శ్రీమతి గంధసిరి లలిత గారు మహిళా భక్తులు గందసిరి శ్రీలత గడ్డం భవాని తూము నాగవేణి కామగాని సత్యవతి వెన్నబోయిన ధనలక్ష్మి
బచ్చు ఖాదర్ బాబు కామగాని బుచ్చయ్య గడ్డం రాఘవులు గడ్డం వెంకటేశ్వర్లు కొంపల్లి శ్రీను జాజాల నాగరాజు వెన్నబోయిన రమణ వెన్నబోయిన రాజు
చెన్నకేశవ యూత్ సభ్యులు పాల్గొన్నారు